తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
మంగళవారం
21 జూలై 2026
పేజీలు : 8
Follow :

# ప్రభుత్వాలు మారినా చెరువుపల్లి రోడ్డు తలరాత మారలేదు..!

- ○చిన్న వర్షానికే చెరువులను తలపిస్తున్న రహదారి ? బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్
- ○ఎల్నినో ప్రభావం ప్రజలు ఇబ్బంది పడకుండా చూసుకోవలసిన బాధ్యత మన అందరిదీ
- ○నల్లగొండ ఇంచార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్






**నల్లగొండ ప్రతినిధి,జులై 20,(జనంసాక్షి):** నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణంలోని ఉదయాదిత్య భవన్లో ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనే సంసిద్ధత, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, తదితర అంశాలపై ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహిస్తూ ఎల్ నినో వల్ల ఎదురయ్యే పరిస్థితులను ఎదుర్కోవడంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎల్ నినో వల్ల రాబోయే రోజుల్లో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నందున ప్రత్యేకించి వ్యవసాయం, సాగునీరు, తాగునీరు అన్నింటికి సమస్యలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. రాబోయే పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు అన్ని రకాలుగా ప్రజలకు అండగా నిలబడాలని, ముఖ్యంగా రైతులు పంటల మార్పిడి, ఆరుతడి పంటల వైపు వెళ్లేలా అవగాహన కల్పించాలని, ప్రస్తుతం వేసుకున్న పంటలు కాపాడేందుకు ప్రయత్నించాలని,వర్షపాతంపై ఎప్పటికప్పుడు ప్రజలను, రైతులను అప్రమత్తం చేసి నష్టపోకుండా చూడాలని, భూగర్భ జల,వ్యవసాయ, ఉద్యాన తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ క్షేత్రస్థాయికి వెళ్లి రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇది వరకే వరి వేసుకున్న రైతులను ఆదుకునే విధంగా చూడాలని, సాగునీటి కోసం ప్రత్యేకంగా బోర్లు వేయకుండా నియంత్రించాలని, తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో వల్ల అంతర్జాతీయ స్థాయిలో విపత్కర పరిణామాలు ఏర్పడతాయని, మన దేశంలో సూపర్ ఎల్ నినో గా నిపుణులు చెబుతున్నారని, ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉన్న దృష్ట్యా ఎట్టి పరిస్థితులలో రైతులు వరి సాగు చేయకుండా అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా ప్రాజెక్టులలో నీరు లేకపోవడం ,వర్షాలు తక్కువగా ఉన్న విషయాన్ని రైతులకు విస్తృత ప్రచారం కల్పించాలని బోర్లు వేసుకున్నప్పటికీ చివరి వరకు నీరు వచ్చే అవకాశం లేనందున పంటలు వేసుకుని ఇబ్బందులు పడే పరిస్థితి తీసుకురావద్దని, వాస్తవ పరిస్థితిని గమనించి రైతులు ముందుకు వెళ్లాలని కోరారు. అంతేకాక ప్రస్తుతం ప్రాజెక్టులలో ఉన్న నీరు తాగునీటికి మాత్రమే సరిపోతుందనే విషయాన్ని గమనించాలని, వర్షాలు రాకుంటే వచ్చే జూలై వరకు తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉందని, ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలకు వెళ్లాలని, పంట మార్పిడి పై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు. తాగునీటికి సంబంధించి దేవరకొండ నియోజకవర్గం లో తాగునీరు అందించేందుకు లింకేజీ ఏర్పాటు చేయాలని, ఉమ్మడి జిల్లాలోని ఎస్ఎల్బీసీ, డిండి తో పాటు, ఆయా నియోజకవర్గాలలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులన్నింటిని ఈ హయాంలోనే పూర్తి చేస్తామని, దేవాదుల ఫేస్ -6 ద్వారా తుంగతుర్తి నియోజకవర్గానికి గోదావరి జలాలు అందిస్తామని, డిండి ప్రాజెక్టు పనులు, దున్నపోతుల గండి, బస్వాపూర్ లను వేగవంతం చేస్తామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వాస్తవ పరిస్థితులను సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, మీడియా తదితరులకు వివరించారు.

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడే పరిస్థితులను ఎదుర్కోవడంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ జిల్లా ప్రజలకు అండగా నిలబడాలని కోరారు. ఎల్ నినో వల్ల ఏర్పడ్డ కరువు పరిస్థితులతో ప్రజలు అధైర్య పడవద్దని, రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని, కరువు పరిస్థితిలో ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని, ఎస్ఎల్ బీసీ 600 మీటర్లు పూర్తయిందని, ఆగస్టు 2028 నాటికి ఎస్ఎల్బీసీ పూర్తి అయితే ఉమ్మడి నల్గొండ జిల్లా మొత్తం సస్యశ్యామలమవుతుందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాగునీటిని దృష్టిలో ఉంచుకొని ఉదయ సముద్రం లో నీళ్లు నింపాలని, మూసి నుండి తిప్పర్తి మండలానికి సాగునీటిని వదలాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దేవరకొండ నియోజకవర్గం లోని మూడు మండలాలలో తాగునీటి సమస్య గడిచిన మూడు నెలలుగా ఉన్నందున అక్కడ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సమస్యను పరిష్కరించాలని, వెంటనే గ్రామాల ప్రజలకు తాగునీరు అందించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. నల్గొండ నియోజకవర్గంలో ఇదివరకే వరి నాట్లు వేసుకున్న రైతులకు ఓవర్ లోడ్ కాకుండా అవసరమైతే అదనపు పవర్ కు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించాలని ,బడ్జెట్ మెటీరియల్

మిగతా 12లో

## ప్రభుత్వాలు మారినా చెరువుపల్లి రోడ్డు తలరాత మారలేదు..!

- చిన్న వర్షానికే చెరువులను తలపిస్తున్న రహదారి
- బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్
- నరకయాతన అనుభవిస్తున్న ప్రయాణికులు, గ్రామస్తులు
- వెంటనే పక్కా బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్




**మాడుగులపల్లి జులై 20 (జనంసాక్షి):** పాలకులు మారుతున్నారు, ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ ఆ పల్లెకు వెళ్లే దారి భాగ్యం మాత్రం మారడం లేదు రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో మాడుగులపల్లి మండలం చెరువుపల్లి గ్రామానికి వెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సి వస్తోందని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు దశాబ్దాలు గడుస్తున్నా గ్రామానికి పక్కా బీటీ రోడ్డు మంజూరు కాకపోవడంతో రాకపోకలు సాగించేందుకు పల్లెవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

### వర్షం వస్తే సముద్ర ప్రయాణమే

కొద్దిపాటి వర్షం కురిసినా ఈ రహదారి పరిస్థితి మరీ దారుణంగా తయారవుతోంది రోడ్డంతా పెద్ద పెద్ద గోతులు,నీటి కుంటలుగా మారిపోతోంది రోడ్డుపై ఎక్కడ గోతులు ఉన్నాయో తెలియక వాహనదారులు సముద్రంలో పయనిస్తున్నామా అనే చందంగా భయాందోళన నడుమ ప్రయాణం చేస్తున్నారు

### అత్యవసర వేళల్లో తీవ్ర ఇబ్బందులు

నీరు చేరిన గోతుల్లో ద్విచక్ర వాహనాలు జారిపడి నిత్యం వాహనదారులు గాయాల పాలవుతున్నారు. రాత్రి వేళల్లో అత్యవసర వైద్యం కోసం అంబులెన్స్ లేదా ఇతర వాహనాలు గ్రామానికి రావడానికి డ్రైవర్లు నిరాకరిస్తున్నారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బురద రోడ్డుపై నడవలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు

### గ్రామస్తుల ఆవేదన

ఎన్ని ప్రభుత్వాలు మారినా మా ఊరి రహదారి దుస్థితి మారడం లేదు చిన్న వర్షం పడినా గ్రామం ముళ్లబాటలా మారుతోంది ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి తాత్కాలిక మరమ్మతులు కాకుండా పూర్తిస్థాయి పక్కా బీటీ రహదారిని మంజూరు చేయాలి అని చెరువుపల్లి గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



## కాంట్రాక్టర్ నిర్లక్ష్యం విద్యార్థులకు శాపమా!?

- రోజులు గడుస్తున్న అభివృద్ధికి అడ్డం వచ్చిన తొలగింపులో నిర్లక్ష్యం?
- ఆట స్థలం లేక ఇక్కట్లు పడుతున్న పాఠశాల విద్యార్థులు!
- బడికి పోవాలంటే రహదారి నిర్బంధం చేశారని ఆరోపణలు
- ఉన్నతాధికారులు వెంటనే తొలగించి ఆవరణను శుభ్రం చేయించాలంటే విద్యార్థులు విజ్ఞప్తి

**అన్నపురెడ్డిపల్లి జులై 20 (జనంసాక్షి)** అభివృద్ధి పేరుతో కొందరు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి అమాయక పిల్లలకు ఇబ్బందులకు గురవుతున్నారు అని వారి నిర్లక్ష్య ధోరణి కారణంగా పనులు మాట దేవుడెరుగు గానీ ఆట స్థలాలు లేక ఎటు తిరిగిన శరీరానికి గాయాలయి పాఠశాలకు పోవాలన్న భయం పుట్టేలా వ్యవహరించడం తీరుపై తల్లిదండ్రుల

# యువతకు మెరుగైన క్రీడా వసతులు - పట్టణ సౌందర్యానికి సెంట్రల్ లైటింగ్ : ఎమ్మెల్యే జారే

○అశ్వారావుపేట క్రీడా మైదానం, సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జారే..

○క్రీడాకారులకు ఆధునిక వసతులు - పట్టణ సౌందర్యానికి మరింత ప్రాధాన్యం

**అశ్వారావుపేట జూలై20,(జనంసాక్షి):**
అశ్వారావుపేట మున్సిపల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు ఎమ్మెల్యేతో కలిసి క్రీడా మైదానాన్ని, పట్టణంలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులను సందర్శించి, పనుల పురోగతిని సమీక్షించారు. ముందుగా క్రీడా మైదానాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అక్కడి మౌలిక సదుపాయాలు, క్రీడాకారులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అభివృద్ధి చేయాల్సిన అంశాలపై అధికారులతో చర్చించారు. యువతకు నాణ్యమైన క్రీడా వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలని సూచించారు. అథ్లెటిక్స్, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడలకు అనువుగా మైదానాన్ని తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. క్రీడా మైదానంలో తాగునీటి సౌకర్యం, పారిశుధ్యం, విద్యుత్ లైటింగ్, డ్రైనేజీ, క్రీడాకారులకు విశ్రాంతి గదులు, ప్రేక్షకుల కోసం కూర్చునే ఏర్పాట్లు వంటి మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే యువ క్రీడాకారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాధన చేసే విధంగా మైదానాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని తెలిపారు.
అనంతరం అశ్వారావుపేట పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, పనులు నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులు, కూడళ్లలో ఏర్పాటు చేస్తున్న లైటింగ్ వ్యవస్థ ప్రజలకు భద్రతను కల్పించడంతో పాటు పట్టణానికి మరింత అందాన్ని తీసుకువస్తుందని పేర్కొన్నారు. విద్యుత్ దీపాల ఏర్పాటులో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, భవిష్యత్తులో నిర్వహణకు ఇబ్బందులు తలెత్తకుండా పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, అశ్వారావుపేటను అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడంతో పాటు యువతకు క్రీడల్లో ప్రోత్సాహం కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎలాంటి రాజీ ఉండదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి పనిని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. క్రీడా మైదానం అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయిన తర్వాత అశ్వారావుపేటకు కొత్త రూపు రానుందని అన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో మున్సిపాలిటీ పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ప్రజాప్రతినిధులు, కోలా లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు మిండా హరిబాబు, జీనుగు రవీంద్ర, స్థానిక నాయకులు, జూపల్లి ప్రమోద్, వెలుపుల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# సర్ లో ప్రతి ఓటరు నమోదు అయ్యే విధంగా కృషి చేయాలి

ఎమ్మెల్యేడాక్టర్ మట్టా రాగమయి దయానంద్

**కల్లూరు జూలై 20(జనం సాక్షి)**
కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ 2026 కార్యక్రమంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తూప్రతి ఓటరు తప్పనిసరిగా తమ పూర్తి వివరాలను నమోదు చేసుకునే విధంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బిఎల్ ఏ లు సమన్వయంగా వ్యవహరిస్తూ కృషి చేయాలని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సత్తుపల్లి నియోజకవర్గం వ్యాప్తంగా ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా ప్రతి అర్హులైన ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయడానికి కాంగ్రెస్ పార్టీబూతు లెవల్ ఏజెంట్లు ,ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ, బూత్ స్థాయి నాయకులు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించాలని సూచించారు. ఓటర్ల జాబితాలోని ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి ఎంతో విలువైనదిఅన్నారు ఎలాంటి కారణంతోనైనా అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందనే నేపథ్యంలో ప్రతి గ్రామంలో, ప్రతి బూత్‌లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లందరికీ అవగాహన కల్పించి, ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి చేయించేలా కృషి చేయాలని సూచించారు. ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కార్యకర్త ఈ బాధ్యతను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, "ఒక్క ఓటు కూడా మిస్ కాకూడదు" అనే లక్ష్యంతో పని చేయాలని కోరారు.



# రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు సత్కారం

**రామన్నపేట, జూలై 20 (జనంసాక్షి):**
ఈనెల 18 న మెదక్ జిల్లా ఇందిరా ప్రియదర్శిని అథ్లెటిక్స్ స్టేడియం లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలలో రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు తోటకూరి శివాని బి.ఏ. ప్రథమ సంవత్సరం అండర్ 18 బాలికల 1500 మీటర్ల విభాగంలో గోల్డ్ మెడల్, జి.సునీల్ బి.ఏ. ద్వితీయ సంవత్సరం పురుషుల 1500 మీటర్ల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారని కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. శివాని, సునీల్ గత కొంత కాలం నుండి హనుమాన్ ట్రైనింగ్ సెంటర్ భువనగిరిలో అథ్లెటిక్స్ కోచ్ కోనేటి గోపాల్ వద్ద శిక్షణ తీసుకుంటున్నారని, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షినీచారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ ఎం. రవీందర్ రావుతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.



# రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ పూర్తి చేయాలి

✧ డివిజన్ అధ్యక్షుడు సాగర్ల శివరావు

**చిలుకూరు జూలై 19:(జనంసాక్షి):**
చిలుకూరు మండలంలో వున్న రేషన్ లబ్ధిదారులు తమ రేషన్ కార్డులకు సంబంధించి ఈ-కేవైసీ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన గడువు జూలై 31 లోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని రేషన్ డీలర్ల సంఘం డివిజన్ అధ్యక్షుడు సాగర్ల శివరావు తెలిపారు .రేషన్ కార్డులో నమోదైన ప్రతి సభ్యుడు తప్పనిసరిగా సమీపంలోని చౌకధరల దుకాణానికి వెళ్లి ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధృవీకరణ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేయని సభ్యులకు భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రేషన్ సేవల కొనసాగింపులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు లేదా ఇతర కారణాల వల్ల చౌకధరల దుకాణానికి హాజరు కాలేని వారి వివరాలను సంబంధిత చౌకధరల దుకాణ డీలర్లకు ముందస్తుగా గుర్తించి వారి ఇంటి వద్దకే వెళ్లి ఈ కేవైసీ చేయాలని సూచించారు. మండలంలోని రేషన్ కార్డుదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసి ప్రభుత్వ సేవలను నిరంతరాయంగా పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై యువత పోరాడాలి

**చిలుకూరు, జూలై 19,(జనంసాక్షి):**
చిలుకూరు మండల కేంద్రంలో సూర్యాపేట జిల్లా మూడోవ మహాసభను కస్తూరి అప్పారావు ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మేకల శ్రీనివాస్ జెండాను ఎగరవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై యువత తిరుగుబాటు చేయాలని యువతను ఓటు బ్యాంకుగా మాత్రమే చేసే రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించాలని దేశాన్ని అభివృద్ధి పేరుతో కార్పోరేట్ శక్తులకు తాకట్టు పెడుతున్న కేంద్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని రాష్ట్ర ప్రభుత్వం యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాయని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ లక్షలాది ఉద్యోగ అవకాశాలను కాలరాస్తున్నారని మరోవైపు కాంట్రాక్ట్,ఔట్సోర్సింగ్ ఎకనామి పేరుతో శాశ్వత ఉద్యోగాలనే అంతం చేసే కుట్ర జరుగుతుందని చదివిన యువత ఉద్యోగాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే పాలకులు మాత్రం ప్రచారాలతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగం ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ప్రభుత్వ విద్య, వైద్య రంగాల నిర్వీర్యం, కార్మిక హక్కుల సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సమాధానం చెప్పాలని ఏవైఎఫ్ సూర్యాపేట జిల్లా మహాసభ నుండి డిమాండ్ చేస్తున్నామని అన్నారు. సెప్టెంబర్ 8 9 10 తేదీలలో యాదగిరిగుట్ట, యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలను విజయవంతం చేయాలని అన్నారు. అనంతరం సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి యువత కేవలం ఉద్యోగం సాధించడం మాత్రమే కాకుండా సమాజాన్ని శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకునే అవగాహన కూడా అత్యంత అవసరమని శాంతి అభ్యుదయం శాస్త్రీయ సోషలిజం అనే ఏఐవైఎఫ్ సిద్ధాంతాన్ని యువతలో విస్తృతంగా తీసుకెళ్లి, ప్రజా సమస్యలపై చైతన్యం పెంపొందిస్తూ ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల్ల ధనుంజయ నాయుడు, ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి చేపూరి కొండలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడవేల్లి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగరాజు, సైదులు, వీరన్న, శ్రీను, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, మండవ వెంకటేశ్వర్లు, షేక్ సాయి బల్లి, ఎస్.కె లతీఫ్, గుండు వెంకటేశ్వర్లు బత్తిని హనుమంతరావు ప్రజా సంఘాల బాధ్యులు పిల్లుట్ల కనకయ్య, రెమిడాల రాజు, చిలువేరు ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఈ కాలువ వద్దు'.. ఎమ్మెల్యే జారేకు రాజపురం రైతుల వినతి

**వరి పొలాల మధ్య పనికిరాని కాలువను నిలిపివేయాలని డిమాండ్**

**చెరువులకు లింకు కాలువలు ఏర్పాటు చేస్తేనే రైతులకు ప్రయోజనమని విజ్ఞప్తి**



అన్నపురెడ్డిపల్లి, జులై 20 (జనం సాక్షి) సీతారామ ప్రాజెక్టు పరిధిలో ప్రతిపాదించిన 11 ఆర్-ఆర్ ఎం-1 లింకు కాలువ తమకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చదని, వరి పొలాల మధ్యగా వెళ్లే ఈ కాలువను వెంటనే నిలిపివేయాలని రాజపురం గ్రామ రైతులు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు.రాజపురం గ్రామంలోని నర్సాపురం రెవెన్యూ పరిధిలో ప్రతిపాదించిన 11 ఆర్-ఆర్ ఎం-1 లింకు కాలువ పెద్దమ్మ చెరువు నుంచి వరి పొలాల మధ్యగా వచ్చి మధ్యలోనే ముగిసిపోతుందని రైతులు వివరించారు. ఈ కాలువ నిర్మాణం వల్ల సుమారు 13 ఎకరాల చిన్న, సన్నకారు రైతుల సాగుభూమి కోల్పోయే ప్రమాదం ఉందని, అయితే రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం ప్రాజెక్టు మ్యాప్‌లో ఉన్నట్లుగా రాముడు చెరువు, పెద్దమ్మ చెరువులకు లింకు కాలువలు నిర్మిస్తే రెండు చెరువుల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని, అదే రైతులకు ఉపయోగకరమైన పరిష్కారమని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వరి పొలాల మధ్యగా ప్రతిపాదించిన పనికిరాని కాలువను వెంటనే రద్దు చేసి రైతుల భూమి లను కాపాడాలని కోరారు.రైతుల వినతిపై స్పందించిన ఎమ్మెల్యే జారే ఆది నారాయణ, నర్సాపురం గ్రామసభకు స్వయంగా హాజరై రైతులు, అధికారులతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, గణపతిరెడ్డి, ఏసుబాబు, సీతారామిరెడ్డి, అరుణ, పృథ్వి, కేశవులు, కంచు ప్రసాద్, సోమయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యం విద్యార్థులకు శాపమా!?

సైతం ఆగ్రహిస్తున్న సందర్భం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చెట్లు తొలగింపు నిర్లక్ష్యానికి ప్రధాన కారణమైంది మండలంలోని తొట్టి పంపు గ్రామపంచాయతీలో ఒడ్డుగూడెం ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో భాగంగా ప్రహరీ గోడ కు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులను చకచకా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. దీంతో సదర కాంట్రాక్టర్ పనుల్లో భాగంగా పాఠశాల ఆవరణలో ఉన్న పలు చెట్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టి రోజులు గడుస్తున్న వాటిని తొలగించడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల పిల్లలు పాఠశాలకు పోవాలన్న కొంత ఆందోళన గురవటమే కాకుండా ఆట సమయంలో ఆడుకునేందుకు అడ్డంకులు ఉండటంతో అనేక శరీర దెబ్బలు తగులుతున్నాయని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు సైతం మండిపడుతున్నారు అభివృద్ధి మాటను వృక్షాలను తొలగించడం వాటిని ప్రదేశంలో నుండి బయటకు తరలించడంలో ఇంత నిర్లక్ష్యం వహించడం సరికాదని తక్షణమే కాంట్రాక్టర్ ఆట స్థలాన్ని శుభ్రం పరిచే విధంగా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులు సైతం స్పందించాలంటూ గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన




భద్రాచలం జులై 20 (జనంసాక్షి) యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ సోమవారం భద్రాచలంలో విద్యుత్తు శాఖ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భద్రాచలం జేఏసీ జిల్లా కన్వీనర్ జీవన్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులంతా ఏకం కావలసిన సమయం ఆసన్నమైందని అన్నారు. కార్మికులు ఉద్యోగులు ఉద్యోగుల సంఘాలన్నీ ఏకమైనప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటు కరిస్తే ఉద్యోగులు మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, అంతా ఒక తాటి పైకి వచ్చి ఉద్యమించి న్యాయమైన హక్కులను పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ నర్సింహారావు, ఏఏవో లక్ష్మి, ఏఈలు.రోహిణి, జ్యోతి, ఉపేందర్ ,వెంకటేశ్వర్లు, సబ్ ఇంజనీర్ లు. హరి, తరుణ్, రాకేష్, లిఖిత, మౌనిక, మహిళలు. లీలావతి, పుణ్యవతి, దీప్తి, ట్రేడ్ యూనియన్ నాయకులు వెంకట్రాజు, రామకృష్ణ, ఉదయ్ పాల్గొన్నారు.

## గంజాయి కేసులో నిందితులకు విముక్తి

**- సాక్ష్యాధారాలు విశ్వసనీయంగా లేవన్న కోర్టు**

బూర్గంపహాడ్ జులై 20 (జనంసాక్షి) 2021లో నమోదైన గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ కొత్తగూడెం జిల్లా కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలు విశ్వసనీయంగా లేవని పేర్కొంటూ న్యాయమూర్తి సరిత కేసును కొట్టివేశారు. కేసు వివరాల ప్రకారం, మల్లోజు సునీల్ వర్మ, యశోధర 15 కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలపై 2021లో బూర్గంపహాడ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం ఈ కేసు కొత్తగూడెం జిల్లా కోర్టులో ఎస్సీ ఎన్‌డీపీఎస్ నెం. 142/ 2022 గా విచారణకు వచ్చింది. సుదీర్ఘకాలం విచారణ అనంతరం ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు, అభియోగాలను నిరూపించేంత బలమైన, విశ్వసనీయమైన సాక్ష్యాలు లేవని పేర్కొంటూ నిందితులపై నమోదైన కేసును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. నిందితుల తరపున సీనియర్ న్యాయవాదులు ముత్యాల కిషోర్, జగదీష్ వాదనలు వినిపించారు.



## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేందర్ ప్రధాన్ రాజీనామా చేయాలి

**సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన**

భద్రాచలం జూలై 20 (జనంసాక్షి) విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడి నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి కారకుడైన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, సోనం వాంగ్చుక్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను భగ్నం చేసిన కేంద్ర ప్రభుత్వ చర్యలను ఖండించాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ అన్నారు. సోమవారం సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లోని అమరవీరుల స్థూపాల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి గద్దం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో ఏజే రమేష్ మాట్లాడుతూ అనేక ఆశలతో నీట్ పరీక్షలు రాసిన 22 లక్షల మంది విద్యార్థులు పరీక్ష పత్రాల లీకేజీ తో తీవ్ర ఆవేదనకు లోనయ్యారన్నారు. తీవ్ర మనస్తాపానికి గురై 25 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఈ చర్యకు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్యాశాఖ మంత్రి ధర్మేందర్ ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత 25 రోజులుగా కాక్రోస్ జనతా పార్టీ, వామపక్ష విద్యార్థి సంఘాలు ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని విమర్శించారు. విద్యార్థుల ఉద్యమానికి మద్దతుగా ప్రముఖ పర్యావరణ వేత్త సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్ 22 రోజులుగా ఆమరణ దీక్ష చేసిన కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. . ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి కారం పుల్లయ్య జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు, పి సంతోష్ కుమార్ పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, నకిరేకంటి నాగరాజు అజయ్ కుమార్, కొలగాని రమేష్, ధనకొండ రాఘవయ్య డి కనక శ్రీ, కోరాడ శ్రీనివాస్,సంద్ర భూపేంద్ర, సీనియర్ నాయకులు ఎం వి ఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పద్మావతి ఆసుపత్రిలో క్యాన్సర్ వైద్య సేవల ప్రారంభం

**○ ప్రతి నెల నిపుణుల సేవలు అందుబాటులో ఉంటాయని విలేకరుల సమావేశంలో వెల్లడి ○ డా. మల్లంపాటి నరసింహారెడ్డి**




భద్రాచలం జూలై 20 (జనంసాక్షి) భద్రాచలంలోని పద్మావతి హాస్పిటల్స్‌లో క్యాన్సర్ వైద్య సేవలను ప్రారంభించినట్లు ఆసుపత్రి నిర్వాహకులు డా. మల్లంపాటి నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇకపై ప్రతి నెల మెడికల్ ఆంకాలజిస్ట్, సర్జికల్ ఆంకాలజిస్ట్, రేడియేషన్ ఆంకాలజిస్ట్ల సేవలు ఆసుపత్రిలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన మెడికల్ ఆంకాలజిస్ట్ డా. బండా రవి తేజ రోగులను ఉచితంగా పరీక్షించి, క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సేవలతో రోగులు హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు ప్రయాణ వ్యయం, సమయం ఆదా అవుతాయని పేర్కొన్నారు. అలాగే వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స పొందే అవకాశం పెరుగుతుందని వివరించారు. భవిష్యత్తులో కూడా ప్రతి నెల ఈ సేవలను మరింత విస్తృతంగా అందించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు, మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు. విలేకర్ల సమావేశంలో డా. హేమంత్ కాకర్ల, డా. మండవ తేజస్వి పాల్గొన్నారు.

## నేడే పామాయిల్ రైతులు ఆత్మీయ సమ్మేళనం

**హాజరుకానున్న మంత్రి తుమ్మల ఎమ్మెల్యే జారే**



ములకలపల్లి జూలై 21 జనంసాక్షి: ములకలపల్లి మండలంలోని కంపగూడెం క్రాస్ రోడ్ వద్ద పామాయిల్ రైతులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నారు. పామాయిల్ రైతుల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజర వుతున్నట్లు నిర్వాహకులు బాల అప్పారావు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండలం లోని అందరూ రైతులు హాజరుకావాలని ఆయన కోరినారు.

## ఫోక్సో కేసు లో నిందితుడుని రిమాండ్ కు తరలింపు



అడ్డగూడూరు,జులై 19(జనం సాక్షి ) ప్రేమ పేరుతో మైనర్ బాలికను వేధించి, ఇంట్లోకి చొరబడి అసభ్యంగా ప్రవర్తించి, చివరికి కిడ్నాప్ చేసి మరో రాష్ట్రానికి తీసుకెళ్లిన ఘటనలో యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు,అడ్డగూడూరు సబ్ ఇన్స్పెక్టర్ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... అడ్డగూడూరు గ్రామానికి చెందిన బాలెంల చైతన్య s/o మధు, 22, డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థి, సిటీ కాలేజ్, హైదరాబాద్ అనే యువకుడు ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో వెంటపడుతున్నాడు. 08-07-2026 సాయంత్రం బాలిక ఇంట్లోకి గోడ దూకి వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక కుటుంబ సభ్యులు 10-07-2026న అడ్డగూడూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.13-07-2026న బాలిక వాంగ్మూలం రికార్డు చేయగా అత్యాచారం జరిగినట్లు తెలపడంతో సెక్షన్లు పెంచారు. అదే రోజు అర్ధరాత్రి నిందితుడు చైతన్య, బాలికను మలక్‌పేటలోని బంధువుల ఇంటి వద్ద నుండి కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడు. ఈ మేరకు మలక్‌పేట పోలీస్ స్టేషన్ లో కిడ్నాప్ కేసు నమోదైంది.నిందితుడు బాలికను వారణాసి, ఉత్తరప్రదేశ్ కు తీసుకెళ్లి, అక్కడి నుండి తిరిగి హైదరాబాద్ వస్తుండగా పోలీసులకు అందిన సమాచారంతో అడ్డగించి అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కు తరలించారు. బాలికను భువనగిరి సఖి వన్ స్టాప్ సెంటర్ లో సంరక్షణకు ఉంచినట్లు పోలీసులు తెలిపారు.



# ఈశ్వరమ్మ యాదవ్‌కు జక్కిడి శివ చరణ్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

## డా. బుషిపాక గణేష్

**మోత్కూరు జూలై 20 (జనంసాక్షి)**

యాదాద్రి ఆలయ కమిటీ బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్‌ను రాజ విద్యార్థి ఎంఅ నాయకులు డా. బుషిపాక గణేష్ పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఈశ్వరమ్మ యాదవ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ, ఆమెకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 80 సంవత్సరాల వయస్సు గల బీసీ మహిళపై అసభ్య పదజాలంతో మాట్లాడటం ఖండనీయమని, కాంగ్రెస్ పార్టీ శివ చరణ్ రెడ్డిపై చర్యలు తీసుకోకుండా ఆయనకు భద్రత కల్పించడం వివక్షకు నిదర్శనమని విమర్శించారు. అదే సమయంలో కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు షబ్బీర్ అలీకి సంబంధించిన ఆడియో వైరల్ అయిన వెంటనే పార్టీ నోటీసులు జారీ చేసిందని, అయితే శివ చరణ్ రెడ్డి విషయంలో మాత్రం భిన్నంగా వ్యవహరించడాన్ని ప్రశ్నించారు. ఈశ్వరమ్మ యాదవ్‌కు తగిన భద్రత కల్పించడంతో పాటు, శివ చరణ్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పే వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ఉమ్మడిగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో అగ్రకుల నాయకులకు ఒక న్యాయం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులకు మరో న్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ, ఒక బీసీ మహిళను అవమానించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# వీఆర్ఎ ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి



యాదాద్రి భువనగిరి జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్ల పరిధిలో మొత్తం 85 మంది (విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్) పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలని విఆర్ఎ సంఘం డిమాండ్ చేసింది. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో సంఘం నాయకులు మాట్లాడుతూ, గత నాలుగేళ్లుగా లకు పోస్టింగ్ ఇవ్వకుండా ఉంచారని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఎస్ఐఆర్ ఎన్నికల విధులు, ఇతర రెవెన్యూ పనుల కారణంగా గ్రామస్థాయిలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. ఒకప్పుడు 53 క్యాడర్ గ్రామాల్లో విధులు నిర్వహించిన ప్రస్తుతం పదవీ విరమణలు, బదిలీలు తదితర కారణాలతో ఖాళీలు ఏర్పడినప్పటికీ వాటిని భర్తీ చేయకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి యాదాద్రి భువనగిరి జిల్లాలో ఖాళీగా ఉన్న 85 పోస్టులను వెంటనే భర్తీ చేసి, గ్రామ పరిపాలనను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రకటనపై విఆర్ఎ సంఘం జిల్లా నాయకులు టి. ఎల్లయ్య, జి. మధుసాగర్ సంతకాలు చేశారు.

### డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**రామన్నపేట, జూలై 20 (జనంసాక్షి):**



రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026- 27 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీ నిమిత్తం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైరీ సైన్స్, కంప్యూటర్ సైన్స్ లేదా కంప్యూటర్ అప్లికేషన్స్, పొలిటికల్ సైన్స్, కామర్స్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 23వ తేదీ గురువారం సాయంత్రం నాలుగు గంటలలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఉద్యోగార్థులు సంబంధిత సబ్జెక్టులో పి.జి.తో పాటు నెట్, సెట్, ఎం.ఫిల్, పిహెచ్.డి. లలో కనీసం ఏదేని ఒక అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని సకాలంలో హాజరు కావాలని కోరారు.

# ఈ నెల 25న నాగన్న సంతాప సభను విజయవంతం చేయాలి

## ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కోశాధికారి పగడాల శివ

**భూదాన్ పోచంపల్లి, జూలై 20 (జనంసాక్షి):**

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, విప్లవ సాంస్కృతికోద్యమ యోధుడు అమరుడు కామ్రేడ్ అరుణోదయ నాగన్న సంతాప సభ ఈ నెల 25న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కోశాధికారి పగడాల శివ తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, సాంస్కృతిక రంగ ప్రతినిధులు, విప్లవ కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. సోమవారం భూదాన్ పోచంపల్లి పట్టణంలో సంతాప సభకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పగడాల శివ మాట్లాడుతూ కామ్రేడ్ నాగన్న గత ఐదు దశాబ్దాలుగా పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు, గౌరవాధ్యక్షుడిగా సేవలందిస్తూ తన పాటలు, కళారూపాల ద్వారా దోపిడీ, పీడన, అసమానతలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కల్పించారని కొనియాడారు. చివరి వరకు ప్రజల కోసమే గానం చేసిన అమర విప్లవ కళాయోధుడు నాగన్న సంతాప సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు పోతగల నరసింహ, గోరుగంటి ముత్యాలు, కొత్త బాబు, రచ్చ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





# ఎల్‌నినో ప్రభావం.. కంది సాగువైపు రైతులు సబ్సిడీపై PRG-176 విత్తనాలు అందుబాటులో

**మోత్కూర్ జూలై 20 (జనంసాక్షి)**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం అనిశ్చితంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో పలువురు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగువైపు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే కొందరు రైతులు కంది సాగు ప్రారంభించగా, వారి నిర్ణయాన్ని వ్యవసాయ అధికారులు అభినందించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కంది వంటి వర్షాభావాన్ని తట్టుకునే పంటల సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని వారు పేర్కొన్నారు.ఇతర రైతులు కూడా స్థానిక వాతావరణ పరిస్థితులను అంచనా వేసి ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని అధికారులు సూచించారు. కంది సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్ర=+-176 రకం కంది విత్తనాలను సబ్సిడీపై అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఆసక్తి గల రైతులు అనాజిపురం రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి సబ్సిడీ విత్తనాలను పొందాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ, వాతావరణానుకూల పంటలను సాగు చేసి మెరుగైన దిగుబడులు, స్థిరమైన ఆదాయం సాధించాలని అధికారులు రైతులకు విజ్ఞప్తి చేశారు.

# అతిథి అధ్యాపకుల కొరకు దరఖాస్తు

**నల్లగొండ,జూలై 20,(జనం సాక్షి):**



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) నల్గొండ కళాశాలలో 2026 - 27 సంవత్సరానికి అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు కోరుతున్నారు. ఇందులో భాగంగా బాటని-1, మైక్రోబయాలజీ-1 జువాలజీ -2, ఫిజిక్స్-2, మ్యాథమెటిక్స్-1, స్టాటిస్టిక్స్-1 కంప్యూటర్ సైన్స్-5, కామర్స్-3, ఎకనామిక్స్-1 హిస్టరీ (ఉర్దూ మీడియం)-1, పొలిటికల్ సైన్స్-1 తెలుగు-3 మరియు హిందీ-1 విభాగాలలో అతిథి అధ్యాపకుల కొరకు దరఖాస్తులు కోరనైనది. అభ్యర్థులు సంబంధిత డిగ్రీలు కనీసం 50% మార్కులు కలిగి ఉండాలి. పీహెచ్డీ, నెట్, సెట్ కలిగి ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత కలదు. అర్హత కలిగిన అధ్యాపకులు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నల్గొండలో ఈ నెల 24వ తారీఖు వరకు తమ దరఖాస్తులను కళాశాల ఆఫీసులో సమర్పించగలరని, అర్హత కలిగిన అధ్యాపకులకు ఇంటర్వ్యూలు జూలై 27 వ తారీఖున నాగార్జున ప్రభుత్వ కళాశాలలో జరుగుతాయని, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా వివరాలకు కళాశాలలో సంప్రదించగలరు.



# నకిలీ విత్తనాలు, డీఏపీ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## కొండ హరీష్ గౌడ్

**హుజూర్‌నగర్, జూలై 20 (జనం సాక్షి):**

పట్టణ బిజెపి అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ పట్టణంలో నకిలీ విత్తనాలు, నకిలీ డీఏపీ, నాణ్యత లేని ఎరువులు అధిక ధరల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల వ్యవసాయశాఖ అధికారి స్వర్ణకి వినతి పత్రం అందించారు. సోమవారం ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ మాట్లాడుతూ రైతులు ఎంతో నమ్మకంతో కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువుల్లో కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని, నకిలీ విత్తనాలు, నకిలీ డీఏపీ పేరుతో రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. నాణ్యత లేని విత్తనాలు, ఎరువుల కారణంగా పంట దిగుబడులు తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులను మోసం చేసే వ్యాపారులపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే, రైతుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ తో పాటు బిజెపి జిల్లా నాయకులు పిడమర్తి చంద్రయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శిలు గుండా గోపి, రాళ్ల బండి రామారావు, చుక్క హరీష్ బలవంత్ సింగ్, రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఇస్రో అంతరిక్ష విజ్ఞాన అవగాహన తరగతులు

**నేరేడుచర్ల( జనంసాక్షి )**

పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల నందు ఇస్రో అంతరిక్ష విజ్ఞాన అవగాహన తరగతులు "రూట్స్ ఎడ్యుటెక్ సర్వీసెస్ స్పేస్ ట్యూటర్" వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతరిక్ష పరిశోధనకు సంబంధించి అధునాతన టెక్నాలజీ తత్సంబంధ విషయాలు విద్యార్థుల విజ్ఞానాభివృద్ధికి తోడ్పడే విధంగా స్పేస్ ట్యూటర్ ప్రతినిధులు కె సంజీవ్ కుమార్, సి కె వినోద్ విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానానికి సంబంధించి తద్వారా శాస్త్రసాంకేతిక రంగంలో అంతరిక్ష పరిశోధన విషయాలు దేశ శాస్త్రజ్ఞులు సాధిస్తున్న విజయాలను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్స్, డ్రగ్ రహిత సమాజ నిర్మాణం కోసం అవగాహన కల్పించడం జరిగింది ' సే నో టు డ్రగ్స్' లైఫ్" నినాదాలను వివరించడం జరిగింది .కార్యక్రమంలో ఎంఈఓ ఎం బాలు ప్రధానోపాధ్యాయులు బట్టు మధు ,ఉపాధ్యాయులు ఎం .సైదులు ,రషీద్ ఖాన్ ,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## వర్షపు నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**హాలియా, జూలై 20 జనం సాక్షి :**
హాలియా పురపాలక సంఘం ఆధ్వర్యంలో జల సంచయ్ జన భాగిదారి 3.0 కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటిని ఒడిసి పట్టండి అనే అంశంపై హాలియాలోని ఓ పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు ప్రతి ఇంటి వద్ద వర్షపు నీటి నిల్వ గుంతలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా ప్రకృతి సమతుల్యతను కాపాడడంతో పాటు వర్షపాతం పెరుగుదలకు తోడ్పడాలని సూచించారు. పురపాలక సంఘం సీనియర్ సహాయకుడు కె. సైదులు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు వర్షపు నీటి నిల్వ గుంతల ప్రాధాన్యతను తెలియజేయాలని.. ఇళ్లలో నీటి కొళాయిల నుంచి లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికట్టాలని సూచించారు. ప్రతి పౌరుడు నీటి సంరక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి జల సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

## బండ రామారం జిల్లా పరిషత్ పాఠశాలలో మోగిన బడిగంట



**తుంగతుర్తి జూలై 20 (జనం సాక్షి)**
మండల పరిధిలోని బండ రామారం మూతబడిన జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం మళ్లీ బడి గంట మ్రోగింది, పాఠశాలలో చదువుతున్న 13 మంది విద్యార్థులకు ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా టీసీలు జారీచేసిన ఇన్చార్జి హెడ్మాస్టర్ మొహమ్మద్ అబ్దుల్ హకీంతోపాటు విద్యార్థులు టీసీలు తీసుకోవడానికి ప్రోత్సహించిన నలుగురు ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు, దీంతో పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అందరూ సస్పెండ్ కావడంతో పాటు విద్యార్థులు లేక పాఠశాల మూతబడింది స్థానిక సర్పంచ్ కోరికొప్పుల నరేష్ గౌడ్ తో పాటు గ్రామస్తులు స్పందించి టీసీలు తీసుకున్న విద్యార్థులందరికీ ఇంటికి వెళ్లి పాఠశాల రావలసిందిగా తల్లిదండ్రులను కోరారు, అంతేకాక గ్రామంలో బడి ఆవశ్యకతను తల్లిదండ్రులకు సర్ది చెప్పడంతో స్పందించిన తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాల పంపించారు, దీంతో ఎంఈఓ ఆదేశాల మేరకు కొత్తగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఆకారపు రవికుమార్ తో పాటు మరో ఇద్దరు కస్తూరిబా ఉపాధ్యాయులు పాఠశాల విధులకు హాజరై విద్యార్థుల చేత ప్రార్థన చేయించి తరగతి గదులలో విద్యాబోధన కొనసాగించారు



# ఏఐటీయూసీ నల్లగొండ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

### - ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి

**గుర్రంపోడు, జూలై 19, (జనంసాక్షి)**
కార్మిక హక్కుల రక్షణే ధ్యేయంగా ఏఐటీయూసీ నల్లగొండ జిల్లా 11వ మహాసభలు గుర్రంపోడు మండల కేంద్రంలో ఆదివారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. ఈ మహాసభలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభ ప్రారంభానికి ముందు జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన కార్మికులు గుర్రంపోడు పురవీధుల్లో భారీ ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రతినిధుల సభలో కార్మిక సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా నూనె రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా పల్లా దేవేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్గా కేవస్ రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎడమ సుమతమ్మ, బరిగెల వెంకటేష్, బంటు రాజేశ్వరి, సహాయ కార్యదర్శులుగా నూనె వెంకటేశ్వర్లు, దోటి వెంకన్న, ఎండి జానీ, కోశాధికారిగా దోనకొండ వెంకటేశ్వర్లు మరో 39 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నట్లు దేవేందర్ రెడ్డి వివరించారు. కార్మిక వ్యతిరేక విధానాలపై సమరభేరి: పలు తీర్మానాలు ఆమోదం ఈ మహాసభలో కార్మిక సంక్షేమం, హక్కుల సాధనకై పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని సభ డిమాండ్ చేసింది. అసంఘటిత రంగ కార్మికుల కోసం సమగ్ర చట్టం రూపొందించాలని, స్కీం వర్కర్ల వేతనాలు పెంచాలని కోరింది. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేసి, కనీస వేతన చట్టాలను సక్రమంగా అమలు చేయాలని ప్రతినిధులు స్పష్టం చేశారు. కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కొత్త పరిశ్రమలను నెలకొల్పి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఈ మహాసభ వేదికగా తీర్మానించినట్లు పల్లా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు.




## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ బి.హరిసింగ్

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.హరిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్లైన్ పోర్టల్లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించి 68 దరఖాస్తులు, డీపీఓ 4, డిడబ్ల్యుఓ 4, డిఆర్డిఓ 3, డిఈఓ 3, మిగిలిన 24 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవని, మొత్తం 106 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ఈ దరఖాస్తులను పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఐ ఐ సి టి డైరెక్టర్ డా.దుంబాల శ్రీనివాస్ రెడ్డి

**రామన్నపేట, జూలై 20 (జనంసాక్షి):**
రామన్నపేట మండలంలోని శోభనాద్రిపురం పాఠశాల నుంచి విద్యా ప్రయాణం ప్రారంభించిన ఐ ఐ సి టి డైరెక్టర్, శాంతి స్వరూప్ బట్నాగర్ అవార్డు గ్రహీత, ప్రముఖ శాస్త్రవేత్త డా. దుంబాల శ్రీనివాస్ రెడ్డి సోమవారం పాఠశాలను సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డా. దుంబాల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి చదువుకుంటే గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, లక్ష్య సాధనకు కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఎంతో అవసరమని సూచించారు. తను చదువుకున్న తరగతి గదులను సందర్శించి నేను ఈ తరగతి గదిలోనే చదువుకున్నానని, నా విద్యా ప్రయాణం ఈ పాఠశాల నుంచే ప్రారంభమైంది అంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చిన్నప్పుడు ఆసిఫ్నగర్ కాలువ వద్ద స్నేహితులతో కలిసి ఆడుకున్న రోజుల్ని సైతం స్మరించుకున్నారు. పాఠశాలలో అమలవుతున్న బోధనా విధానాలను, ఉపాధ్యాయుల సేవలను పరిశీలించి అభినందించారు. పాఠశాల అభివృద్ధి కోసం రూ.50,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త డా. చౌదరి రూ.10,000, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కొండకింది అంజిరెడ్డి రూ.10,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని పాఠశాల అభివృద్ధి కోసం అందించారు. గ్రామ సర్పంచ్ కంచి మధుసూదన్ మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన గొప్ప శాస్త్రవేత్త పాఠశాలను సందర్శించడం గ్రామానికి గర్వకారణమని అన్నారు. మరో రెండు నెలల్లో ఈ పాఠశాలలో చదివి వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరితో ఒక మహాసభ నిర్వహించనున్నామని, ఆ కార్యక్రమానికి హాజరుకావాలని కోరగా డా. దుంబాల శ్రీనివాస్ రెడ్డి తప్పకుండా హాజరవుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీచర్ కళావతి, స్కూల్ స్టాఫ్ పరమేశ్వరి, లతీఫ్ బీ, సంధ్య, గీత టీచర్లు, సోషల్ వర్కర్ యెర్ర నరేష్, గ్రామ కార్యదర్శి పవన్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్, అంగన్వాడీ టీచర్లు, గ్రామ యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## జన విజ్ఞాన వేదిక(జెవివి)సభ్యత్వ నమోదు ప్రారంభం..



చండూరు, జూలై 20 (జనంసాక్షి): జన విజ్ఞాన వేదిక(జెవివి) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమ వారం చండూరులో ఆ వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేపట్టగా మున్సిపల్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల అధినేత డా.కోడి శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్, సన్‌షైన్ పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న, గీతా విద్యాలయం కరస్పాండెంట్ పోలోజు నర్సింహాచారి సభ్యత్వాలు స్వీకరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్రవిజ్ఞాన&జనం ద్వారా మూఢ విశ్వాసాలను , ఛాందస భావాలను అరికట్టడంలో జనవిజ్ఞాన&జన వేదిక చేస్తున్న కృషిని అభినందించారు. వేదిక రాష్ట్ర నాయకుడు వద్దిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏటా చెకుముకి టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న విద్యా నైపుణ్యాలను వెలికి తీస్తుందన్నారు. జనవిజ్ఞాన&జన వేదిక సభ్యత్వ నమోదును అందరు జయప్రదం చేయాలని కోరారు. ఈ రోజు సభ్యత్వాలు తీసుకున్నవారిలో పలువురు విద్యావేత్తలు ఉన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం మరికొన్ని రోజుల పాటు కొనసాగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల ఇన్‌ఛార్జి రాపోలు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేటను బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లో చేర్చాలి



సూర్యాపేట(జనంసాక్షి) : హైదరాబాద్ చెన్నై బుల్లెట్ ట్రైన్ కారిడార్ అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను మళ్లీ చేర్చి, సూర్యాపేటలో బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం భారీ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రం జాతీయ రహదారి65పై ఉన్న ప్రధాన వాణిజ్య పట్టణమని అన్నారు.తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రయాణించే ప్రజలకు కీలక రవాణా కేంద్రంగా నిలిచిందని పేర్కొన్నారు.వరి, పత్తి, మిరప, జొన్న వంటి పంటల ఉత్పత్తి, పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులు, విద్యా, పారిశ్రామిక సంస్థలతో సూర్యాపేట ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని అన్నారు.గతంలో ప్రతిపాదించిన బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను చేర్చినప్పటికీ, ప్రస్తుతం పరిశీలిస్తున్న మూడో అలైన్‌మెంట్‌లో సూర్యాపేటను తొలగించడం సూర్యాపేట జిల్లా ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. సూర్యాపేట జిల్లాలో గత 20 సంవత్సరాలుగా రైల్వే మార్గం కోసం పోరాటాలు కొనసాగుతున్నాయని అన్నారు. గత ఐదు దశాబ్దాలుగా రైల్వే సౌకర్యం కోసం చిరకాలంగా సూర్యాపేట ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు.జిల్లా కలెక్టర్ తక్షణమే కేంద్ర ప్రభుత్వ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి, సూర్యాపేట ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబించేలా సిఫారసు చేయాలని నాయకులు కోరారు. సూర్యాపేటకు రైల్వే సౌకర్యం కల్పించడం ద్వారా జిల్లా అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని అన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ఆరుట్ల జానకి రెడ్డి, అఖిలపక్ష పార్టీల నాయకులు తండు శ్రీనివాస్ యాదవ్, మల్లు నాగార్జున రెడ్డి, బెజవాడ వెంకటేశ్వర్లు, మందారి డేవిడ్ కుమార్, కొత్తపల్లి శివకుమార్, తుక్కాని మన్మథ రెడ్డి, పెద్దిరెడ్డి రాజా, అనుముల రవిబాబు, నూకల సుదర్శన్ రెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, బండపల్లి పాండురంగ చారి, చల్లమల్ల నరసింహ, తల్లమల్ల హసేన్, రమణాచారి, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, బూర వెంకటేశ్వర్లు, కునుకుంట్ల సైదులు, పోలేబోయిన కిరణ్, పేర్ల నాగయ్య, నల్లెడ మాధవరెడ్డి, బుద్ధ సత్యనారాయణ, గుండాల సందీప్, ధనియాకుల శ్రీకాంత్, పుల్లూరి సింహాద్రి,పిడమర్తి భరత్, ఎస్.కె అబ్దుల్ కరీం, కె.యోగానందాచార్యులు ,కోటయ్య, సట్టు నాగయ్య, నవిలే ఉపేందర్, దూలం నగేష్, చెరుకు యాకలక్ష్మి, తంగుళ్ల జనార్ధన్, వేల్పుల వెంకన్న, ఎల్గూరి గోవింద్, పి.మహేష్, దాసరి వెంకన్న యాదవ్, ధరావత్ రవి నాయక్, కోడి లింగయ్య యాదవ్, మేరెడ్డి కృష్ణారెడ్డి, దేవరకొండ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేసిన జిల్లా కమిటీ



తుర్కపల్లి జూలై 20 (జనంసాక్షి): మండల కేంద్రంలోని ధర్మారం గ్రామ రేషన్ డీలర్ మాదోత్ అనిత భర్త ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది. సోమవారం రోజున రేషన్ డీలర్ల జిల్లా కమిటీ తరఫున యాభై వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు కందుల శంకర్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి కోయిలగూడెం వెంకటేష్ ,జిల్లా ఉపాధ్యక్షులు సుర్వి వెంకటేష్ గౌడ్ ,పార్వతమ్మ యాదయ్య, తుర్కపల్లి మండల అధ్యక్షులు కూకుటపు నవీన్, భువనగిరి మండల అధ్యక్షులు గంగాదేవి మహేష్ ,తుర్కపల్లి మండల గౌరవ అధ్యక్షులు కందుకూరి అమర్నాథ్ ,చౌటుప్పల్ మండల అధ్యక్షుడు రంగస్వామి, నారాయణపురం మండల అధ్యక్షుడు దూడల భిక్షంగా గౌడ్, రేవల్ల సత్యనారాయణ, రవి ,మచ్చ నరేష్ గౌడ్, చందా నాయక్, ఇస్మాయిల్ ,లయక్ ,పుట్ట వెంకటేశం, జిల్లా డీలర్ల మిత్రులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని ఒకరు మృతి



జనంసాక్షి, మిర్యాలగూడ : కారు ఢీ కొని ఒకరు మృతి చెందిన ఘటన మిర్యాలగూడ మండల పరిధి లోచోటుచేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్సై ఎం.లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం దామరచర్ల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన కోట సైదులు సోమవారం ఉదయం తన మోటార్ సైకిల్ పై మిర్యాలగూడకి వచ్చుచుండగా మండల పరిధిలోని నూకల వారిగూడెం వద్దకు రాగానే అదే మండలానికి చెందిన కొండ్రపోల్ గ్రామానికి చెందిన బెజ్జం శ్రీనివాస్ తన కారు తో అతివేగంగా ప్రయాణిస్తూ కోట సైదులు బైక్ ను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి వెంటనే అతనిని ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతుని భార్య పుష్పలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## డిండి ఎత్తిపోతల పథకానికి గండి కొడుతున్న తెలంగాణ ప్రభుత్వం

- చేతులు ముడుచుకున్న జిల్లా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి
- బీజేపీ రాష్ట్ర నాయకులు దోనూరు వీరారెడ్డి, జక్కలి రాజు యాదవ్

సంస్థాన్ నారాయణపురం, జూలై 20. ( జనం సాక్షి): సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ మండల కార్యాలయంలో మండల అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్ మాట్లాడుతూ డిండి ఎత్తిపోతల పథకంపై తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా విమర్శించారు.ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో ఆ జిల్లా ఎమ్మెల్యేలు ఉమ్మడి నల్గొండ జిల్లాతో పాటు ముఖ్యంగా మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల రైతాంగానికి ప్రాణాధారమైన డిండి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియను నిలిపివేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారని తెలిపారు. అయితే, నల్గొండ జిల్లా మంత్రిగా ఉన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటివరకు దీనిపై ఎలాంటి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకపోవడం విచారకరమని అన్నారు.జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడంలో చిత్తశుద్ధి చూపడం లేదని ఆరోపించారు. మునుగోడు, దేవరకొండ ప్రాంతాల రైతుల భవిష్యత్తును దెబ్బతీసేలా డిండి ఎత్తిపోతల పథకానికి గండి కొట్టే కుట్ర జరుగుతోందని బీజేపీ నాయకులు ఆరోపించారు.

ఈ కుట్రను నల్గొండ జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు వెంటనే అడ్డుకుని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి డిండి ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి అక్కడి నుంచి శివన్నగూడెం రిజర్వాయర్‌కు నీటిని తరలించేలా చర్యలు తీసుకుని మునుగోడు ప్రాంత రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడం ప్రభుత్వ తక్షణ బాధ్యత అని పేర్కొన్నారు.లేనిపక్షంలో రైతుల హక్కుల పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు దాసోజు వెంకటాచారి, జిల్లా నాయకులు వంగరి రఘు, చిమిర్యాల సర్పంచ్ ఉప్పల రమేష్ గౌడ్, ఉపసర్పంచులు బండమీది కిరణ్, వెలిజాల శ్రీను, మెరుగు సైదులు, కట్కూరి భాస్కర్ గౌడ్, మండల నాయకులు సుర్వి వెంకటేష్ గౌడ్, నర్రి నరసింహ, నెల్లికంటి శ్రీశైలం, ఉస్కాగుల గిరిబాబు గౌడ్, గొల్లూరి సాయి, వంగూరి కృష్ణ యాదవ్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి




బీబీనగర్(జనంసాక్షి): నీట్ పేపర్ లీకేజీ కి నైతిక బాధ్యత వహించి తాను నిర్వర్తిస్తున్న కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బీబీనగర్ మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో ధర్మేంద్ర ప్రధాన్ విద్యా శాఖ మంత్రి కి రాజీనామా చేయాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏ ఎగ్జామ్ జరిపిన పేపర్ లీకేజ్ అవుతుందని అన్నారు ఇటీవల నీట్ పేపర్ లీక్ కావడంతో అట్టి పరీక్షలు రద్దు చేయడంతో విద్యార్థులు మనోవేదనకు గురై ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు ఎక్కడో కాదు బిజెపి పరిపాలిస్తున్న రాజస్థాన్లో పేపర్ లీక్ కావడం చూస్తుంటే విద్యా వ్యవస్థ పట్ల బీజేపీకు ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థం అవుతుందన్నారు ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని అభిజిత్ దీక్షే సిజెపి, విద్యార్థులు, నిరుద్యోగులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా సోనం వాంగ్ చుక్ ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర నిరవధిక నిరాహారదీక్షలో కూర్చుంటే ఆయనను ఆరోగ్యం క్షీణించిందని హైకోర్టు ఆదేశాల మేరకే అరెస్టు చేసి హాస్పిటల్లో జాయిన్ చేశామని ఢిల్లీ పోలీసులు చెబుతున్నారు. కానీ ఎన్ని రోజులు అవుతున్నప్పటికీ దేశవ్యాప్తంగా ప్రజల వస్తున్న డిమాండ్ మంత్రి రాజీనామా విషయంలో కేంద్ర ప్రభుత్వం లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. పారదర్శకమైన పాలన అందిస్తామని చెప్పినటువంటి బిజెపి, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బిజెపి, నీట్ పేపర్ లీక్ అయి అనేక మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నా కంటికి కనబడట్లేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన సోనం వాంగ్ చుక్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే జంతర్ మంతర్ లో నిరువదిక నిరాహార దీక్షలో కూర్చున్న విద్యార్థి, యువజనలకు సంపూర్ణమైన మద్దతు తెలియజేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బందారు శ్రవణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు బందారు శ్రీరాములు, సిఐటియు నాయకులు నోముల ఎల్లారెడ్డి, లింగాల బాలయ్య, ఓవల్ దాస్ మని, ఆకునూరి రాజమౌళి, ప్రమోద్ కుమార్, లక్ష్మాల నరసింహ, ధర్మ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## కె ఆర్ ఆర్ అటానమస్ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

**కోదాడ( జనంసాక్షి):**




కోదాడ పట్టణంలో కె ఆర్ ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సెమిస్టర్ 2, 4 పరీక్షల ఫలితాలను సోమవారం కళాశాలలో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ జి.ఉపేందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హరిస రాణి మేడం, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినే షన్ బి. సైదిరెడ్డి లు విడుదల చేశారు. కళాశాలలో బి ఏ 4 వ సెమిస్టర్ లో 34.33, 2 వ సెమిస్టర్ లో 26.45 శాతం, బీకాం కంప్యూటర్ సైన్స్ 4వ సెమిస్టర్ లో 33.33, 2 వ సెమిస్టర్ లో 26.15 శాతం, బీఎస్సీ లైఫ్ సైన్స్ 4 వ సెమిస్టర్ లో 20.0, 2 వ సెమిస్టర్ లో 33.33, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ 4 వ సెమిస్టర్ లో 34.62, 2 వ సెమిస్టర్ లో 18.68 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు సాధించారని ప్రిన్సిపల్ తెలిపారు. అలాగే 1, 3 వ సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షల ఫలితాలు కూడా విడుదల చేసినట్లు ప్రిన్సిపల్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ తెలిపారు.

## తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో బిఆర్ఎస్ నాయకులపై యూత్ కాంగ్రెస్ ఫిర్యాదు

**తుంగతుర్తి జూలై 20 (జనం సాక్షి)**



లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లపై బిఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్లో యూత్ కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు, సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 18న సర్యూర్నగర్ లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ యువ సంగ్రామ సభలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు సమక్షంలో తమ పార్టీకి చెందిన నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు అలాగే, వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కొమ్ము జోహార్ యువజన కాంగ్రెస్ నాయకులు రాంబాబు శ్రీకాంత్ నాయుడు భుజంగ రావు కొండగడుపుల నవీన్ అక్కినేపల్లి రాములు కరీం బాబా గణేష్ పాల్గొన్నారు.

## వైదిక పోస్టుల నియామకంపై అనుమానాలు.. భర్తీ ప్రక్రియపై ఫిర్యాదులు..

**భద్రాచలం జూలై 20 (జనంసాక్షి)**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఇటీవల చేపట్టిన వైదిక, ఇతర పోస్టుల నియామక ప్రక్రియపై వివాదం నెలకొంది. భర్తీలో తమకు అన్యాయం జరిగిందంటూ ఒక పురోహితుడు, ఒక డోలు వాయిద్యకారుడు దేవాదాయ శాఖ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నియామక ప్రక్రియను పూర్తిస్థాయిలో సమీక్షించాలని వారు కోరడంతో భర్తీపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో 21 మంది అభ్యర్థులకు దేవాదాయ శాఖ మంత్రి, ఉన్నతాధికారులు నియామక పత్రాలు అందజేశారు. అయితే భర్తీ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవస్థానంలో రెండున్నరేళ్లుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో డోలు వాయిద్యకారుడిగా పనిచేస్తున్న కారుమంచి వీరబాబు, రాత పరీక్షలో తనకు 65 మార్కులు వచ్చినప్పటికీ తనను పక్కనపెట్టి మరో వ్యక్తిని ఎంపిక చేశారని ఆరోపించారు. స్థానికుడైన తనకు అన్యాయం చేసి స్థానికేతరుడికి ఉద్యోగం ఇచ్చారని పేర్కొంటూ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. ఈ విషయమై దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే ఆస్థాన పురోహిత పోస్టు భర్తీలో కూడా అన్యాయం జరిగిందని గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామావఝల, రవికుమార్, భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ శర్మ ఆరోపించారు. రామదాసు కాలం నుంచి కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారం వైదిక బ్రాహ్మణుడినే ఆస్థాన పురోహితునిగా నియమించాలని కోరినా పట్టించుకోలేదని, హైకోర్టు ఆదేశాలను సైతం విస్మరించి నియామకం చేపట్టారని ఆరోపించారు. ఈ అంశంపై దేవాదాయ శాఖ మంత్రి జోక్యం చేసుకుని సంప్రదాయానికి అనుగుణంగా నియామకం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

**ఫిర్యాదులపై విచారణ చేస్తాం: ఈవో**

ఈ ఆరోపణలపై దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) కె. దామోదర్‌రావు స్పందిస్తూ, అన్ని పోస్టులను పూర్తిగా పారదర్శకంగా భర్తీ చేశామని తెలిపారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగానే ఎంపికలు జరిగాయని, స్థానిక ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ తదితర పత్రాలను పరిశీలించిన అనంతరమే నియామక పత్రాలు అందజేశామని చెప్పారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని, వాటిపై విచారణ నిర్వహిస్తామని వెల్లడించారు.

## గిన్నిస్ బుక్ లో చోటు దక్కించుకున్న బొంకూరి అరుణ

**తుంగతుర్తి జూలై 20 (జనం సాక్షి)**




సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన బొంకురి అరుణ కరాటే లో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు జక్కించుకుంది ఈ మేరకు ఏప్రిల్ 2026న తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాదులో గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో కరాటే లో అత్యుత్తమ ప్రదర్శన ప్రదర్శించి నందులకు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు జక్కించుకున్నారు, ఈమె గత ఐదు సంవత్సరాలుగా మండలం లో చాలామంది విద్యార్థిని విద్యార్థులకు కరాటా లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇప్పించారు, ప్రస్తుత సమాజంలో ఆత్మ రక్షణకు కరాట ఒక్కటే ఆయుధం లాంటిదని దాన్ని నేర్చుకుంటే భవిష్యత్తులో తమను తాము రక్షించు కోవచ్చునే తెలిపారు. చిన్నతనం నుండి విద్యతోపాటు క్రీడల్లో రాణించి, ఎన్నో అవార్డు లను సాధిం చింద దీనితో పాటు ప్రత్యేకంగా పి ఈ టి కోర్సులో ప్రవేశించి, మంచి వ్యాయామ ఉపాధ్యాయులుగా రాణిస్తూ, సుమన్ షాడో కరాటే లో ప్రత్యేక శిక్షణ పొంది, నేడు తుంగతుర్తి మండలంలో గడిచిన ఐదు సంవత్సరాలుగా ప్రతిరోజు ఉదయం విద్యార్థులకు కరాటే లో శిక్షణ ఇస్తుంది, విద్యార్థులతో జిల్లా, రాష్ట్ర అవార్డులను సైతం గెలిపించిన ఘనత ఆమెకే దక్కింది. తుంగతుర్తి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కరాటే శిక్షణలో, విద్యార్థుల యువత భాగస్వాములు కావాలని ఆమె కోరారు. గిన్నిస్ బుక్ రికార్డు సాధించడంతో కరాటే విద్యార్థులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, మేధావులు, గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు

# చండూరు బస్టాండ్‌లో బస్సుల వేళాపాళా ఏది..?

## నల్గొండ డిపో మేనేజర్‌కు చండూరు వాలా టీమ్ విజ్ఞప్తి!

**చండూరు, జులై 20 (జనంసాక్షి)**




చండూరు బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలు, బస్సుల సమయపాలన లేకపోవడంపై స్థానిక ప్రజలు, విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్గొండ డిపో నుండి చండూరు మీదుగా నడిచే బస్సులు సరైన సమయానికి రాకపోవడంతో నిత్యం ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్‌లో కనీస వసతులు లేవని, దీనిపై ఎన్నిసార్లు నల్గొండ ఆర్టీసీ డిపో అధికారులకు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో మార్పు రావడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమయపాలన లేని బస్సులు: నల్గొండ డిపో నుండి చండూరు మీదుగా నడిచే బస్సులు వేళాపాళా లేకుండా నడవడంతో విద్యార్థులు సమయానికి కళాశాలలకు, ఉద్యోగులు విధులకు వెళ్లలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ ఆవరణలో తాగునీరు, నీడ, సరైన సీటింగ్ వ్యవస్థ లేకపోవడంతో మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు.ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం శోచనీయం. ఇప్పటికైనా ప్రభుత్వం, ఆర్టీసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చండూరు బస్టాండ్ రూపురేఖలు మార్చాలని స్థానిక యువత, చండూరు వాలా టీం అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మరియు ఆర్టీసీ ఉన్నతాధికా రులు తక్షణమే స్పందించి, చండూరు బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా నల్గొండ డిపో నుండి సమయానికి బస్సులను పునరుద్ధరించాలని డిపో మేనేజర్‌కు 'చండూరు వాలా టీమ్' విజ్ఞప్తి చేసింది. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.



## చండూర్ లో అక్రమ వడ్డీ వ్యాపారం..

### సామాన్యులపై వడ్డీ భారం..!

**చండూరు జూలై 20(జనంసాక్షి)**

చండూరు మండలంలో అక్రమ వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతోంది. అమాయకుల అత్యవసరాన్ని ఆసరాగా చేసుకుని నూటికి రూ, 5 నుండి రూ,10 వరకు భారీగా వడ్డీలు వసూలు చేస్తున్నారు. బంగారం, ఇంటి పత్రాలు, పట్టాదార్ పాస్‌పుస్తకాలను తాకట్టు పెట్టుకుని, ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ దందాను నడిపిస్తున్నారు.అధిక వడ్డీలు, చక్రవడ్డీల భారాన్ని తట్టుకోలేక పేద, మధ్యతరగతి కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. అప్పులు రెట్టింపు కావడంతో బాధితులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. చట్టవిరుద్ధంగా సాగుతున్న ఈ అక్రమ వడ్డీ వ్యాపారాలపై అధికారులు తక్షణమే స్పందించి, కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధిత రైతులకు

# నూరు శాతం ఇన్సూరెన్స్ ఇవ్వాలి

**మధిర, జూలై 20 (జనంసాక్షి) :**
మండల పరిధి ఆత్కూరు గ్రామంలోని సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన మిర్చి రైతులకు నూరు శాతం ఇన్సూరెన్స్ పరిహారం వెంటనే అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మధిర తాసిల్దార్ కార్యాలయం ముందు కోల్డ్ స్టోరేజ్ మిర్చి బాధిత రైతులు ధర్నా నిర్వహించి, తాసిల్దార్ కి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదం జరిగి మూడు నెలలు గడుస్తున్నా బాధిత రైతులకు ఎలాంటి నష్టపరిహారం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పెట్టుబడులకు నిధులు లేక, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, అప్పుల చెల్లింపుల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని స్థానిక డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇన్సూరెన్స్ కంపెనీలతో చర్చించి బాధిత రైతులకు వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బొంతు రాంబాబు, జిల్లా కార్యదర్శి మాదినేని రమేష్, కన్వీనర్ దివెల్ల వీరయ్య, సీతారాం రెడ్డి, నాయకులు మడిపల్లి గోపాలరావు, మందడపు ఉపేంద్ర, పడకంటి మురళి తదితరులు, బాధిత రైతులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి?




**ఖమ్మం కార్పొరేషన్, జూలై 20(జనంసాక్షి )**
దేశ రాజధాని దిల్లీలో నీట్ పేపర్ లీకేజీతో పాటు విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఖండిస్తూ, పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరం లోని అర్. ఎన్. బి గస్ట్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా పి డి ఎస్ యూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని అన్నారు. దేశంలో పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు కేంద్రం ప్రభుత్వాన్ని విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థుల శ్రమ, భవిష్యత్తుతో ముడిపడిన పరీక్షల్లో అవకతవకలు చోటుచేసుకోవడం అత్యంత ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు.×× విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బీజేపీ ప్రభుత్వం ఈ వైఫల్యాలకు పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగానికి పాల్పడడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు విద్యార్థుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాల్సింది పోయి, పోలీసులతో లాఠీచార్జ్ చేయించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ప్రభుత్వం పైన ఆవేదన వ్యక్తం చేశారు.దిల్లీలో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్‌కు పాల్పడిన పోలీసు అధికారులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల గొంతును అణచివేసే నిర్బంధ విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కోరారు. నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, అలాగే దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన ఈ పరిణామాలకు రాజకీయ బాధ్యత వహిస్తూ ప్రధాన మంత్రి కూడా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పరీక్షల నిర్వహణలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా, అవసరమైతే దేశవ్యాప్తంగా పెద్దఎత్తున విద్యార్థి ఉద్యమాలను చేపడతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు వినయ్, సహాయ కార్యదర్శి యశ్వంత్, జిల్లా నాయకులు సురేష్, వెంకటేష్, శుశాంత్, సిద్దు గోపి, అనూష, అలేఖ్య సంధ్య, నవ్య పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కమిటీ నాయకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# గుసుల్ ఖానా', 'లిల్లా ఘర్' లను నిర్మించాలి

## మంత్రి తుమ్మల కు సాదిఖ్ అలీ వినతి

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 20( జనంసాక్షి)**
ఖమ్మం నగరంలోని త్రీటౌన్ పరిధిలో ఉన్న చారిత్రాత్మక ఈద్గా? ఖబరస్థాన్ వక్ఫ్ భూమిలో ముస్లిం మైనారిటీల అవసరాల కోసం 'గుసుల్ ఖానా', 'లిల్లా ఘర్' నిర్మించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిఖ్ అలీ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. సోమవారం ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు.1727లో కుతుబ్‌షాహీ? ఆసఫ్‌జాహీ పాలకుల కాలంలో నిర్మితమైన ఈద్గా, కబరస్థాన్ సుమారు 300 ఏళ్ల చరిత్ర కలిగిన వక్ఫ్ ఆస్తి అని తెలిపారు. ఇటీవలి కాలంలో అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాలు, గత కొన్నేళ్లుగా సాగుతున్న ఆక్రమణల కారణంగా వక్ఫ్ భూమి పరిరక్షణకు ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్రమణలను అరికట్టి, వక్ఫ్ ఆస్తిని చట్టబద్ధంగా రక్షించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనాన్ని ముస్లిం సమాజ అవసరాల కోసం 'లిల్లా ఘర్'గా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గతంలో మృతదేహాలకు అంత్యక్రియలకు ముందు చివరి స్నానం చేయించే 'గుసుల్ ఖానా'ను కొత్త భవన నిర్మాణం సందర్భంగా తొలగించారని, దానిని అదే ప్రదేశంలో పునర్నిర్మించేందుకు అవస రమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఈద్గా? ఖబరస్థాన్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, మహమ్మద్ అబ్దుల్ నబీ, ఆరిఫ్, నేలకొండపల్లి మండల అధ్యక్షుడు సుభాన్, కూసుమంచి మండల అధ్యక్షుడు హలీమ్, తిరుమలాయ పాలెం అధ్యక్షుడు సయ్యద్ సైదా, హాది తదితరులు పాల్గొన్నారు.



# దేవాలయాల్లో దోపిడీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

**పెనుబల్లి, జులై 20(జనంసాక్షి)**
పలు దేవాలయాల్లో చోరీకి పాల్పడిన ముగ్గురు అంతర్రా ష్ట్ర దొంగలను వి ఎం బంజర్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి 24 గ్రాముల బంగారం కేజీల వెండి, నేరాలకు ఉపయోగించిన కారు మోటార్ సైకిల్ ను స్వాధీనపరచుకున్నట్లు కల్లూరు డివిజన్ ఏసిపి వసుంధర యాదవ్ తెలిపారు. సోమవారం వి.ఎం బనీజర్ పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏ సి పి మాట్లాడుతూ తల్లాడ మండలానికి చెందిన షేక్ జానీ, ఆంధ్రప్రదేశ్ ఎటపాక మండలానికి చెందిన పేరాల నరసింహారావు, కొత్తగూడెం గౌతమ్ పూర్ కాలనీకి చెందిన అరవ ఉదయ్ కుమార్ అనే వ్యక్తులు , దేవాలయాల్లో చోరీలకు పాల్పడేందుకు ముఠాగా ఏర్పడి పెనుబల్లి, తల్లాడ,వేంసూరు, కల్లూరు, కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గోకవరం గ్రామాల్లో వివిధ ఆలయాల్లో ఏడు చోట్ల చోరీకి పాల్పడి 24 గ్రాముల బంగారం 1.536 గ్రాముల వెండి దోచుకున్నారన్నారు. ఈ ప్రాంతాల్లో దొంగతనానికి పాల్పడేందుకు ఒక కారును మోటార్ సైకిల్ ని దొంగతనంగా కొట్టేసి రవాణా కోసం



వాడారు అన్నారు. ఆ రెండు వాహనాలను కూడా సీజ్ చేశామని తెలిపారు. దేవాలయాల్లో దొంగతనానికి పాల్పడిన సొత్తును రికవరీ చేయడం జరిగిందన్నారు. వీరంతా పాత నేరస్తులేనని వీరిపై డేకాయేట్, ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన కేసులు కూడా హైదరాబాద్ ఎల్బీనగర్ గోకవరం,నేలకొండపల్లి, ములకలపల్లి పోలీస్ స్టేషన్లో వీరిపై కేసులు నమోదై ఉన్నాయన్నారు. తరచూ దొంగతనానికి పాల్పడుతున్న వీరు ముగ్గురిపై పీడియాట్ నమోదు చేసేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేశామని ఆమె తెలిపారు. ఈ దొంగల్ని ఆచూకీ కనిపెట్టడంలో పట్టుకోవడంలో కృషి చేసిన పోలీస్ సిబ్బంది కి నగదు రివార్డు లు అందజేశారు. సమావేశంలో రూరల్ సిఐ ముత్తు లింగయ్య, ఎస్ఐ కే వెంకటేష్, కల్లూరు ఎస్ ఐ హరిత, స్టేషన్ సిబ్బంది పి నాగేందర్, వెంకటేశ్వరరావు నరసింహారావు, ఎస్ కే మజీద్ పాషా, రాజమల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వరివేసి నష్టపోవద్దు ప్రత్యామ్నాయ పంటలు వెయ్యండి

### అగ్రికల్చర్ ఆఫీసర్ అంజనీదేవి

**వలిగొండ, జూలై 20( జనంసాక్షి)**
మండలంలోని గోలేపల్లి, నాతల్లగూడెం, ఆరూరు,వెల్వర్తి గ్రామలో ప్రస్తుత ఎలినో వాతావరణ పరిస్థితుల అనుగుణంగా ప్రత్యామ్నా య పంటలపై రైతులకు మండల వ్యవసాయ అధికారి అంజనీ దేవి అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఎలినో ప్రభావం ఆగస్టు , సెప్టెంబర్ మాసంలో తీవ్రగా ఉంటాయని అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉన్నందున, వర్షాలు కూడా పడే అవకాశం లేనందున భూగర్భ జలాలు అడుగంటే అవకాశం ఉన్నందున వరీ వేసే రైతులు ఇతర ఆరు తడి పంటలు వేసుకోవాలని సూచించడం జరిగింది . ఒక ఎకరా వరి పండించే నీటితో ఇతర పంటలు 5, 6 ఎకరాలు పండించవచ్చని రైతులకు చెప్పారు . కావున రైతులు వరి వేసి నష్టపోవద్దని చెప్పారు, రైతులు కందులు , పేసర్లు , కూరగాయలు , ఆయిల్ ఫామ్ సాగుకు మొగ్గు చూపాలని చెప్పడం జరిగింది . ఈ కార్యక్రమం లో ఏ ఈ ఓ శృతి, పిఎస్ అనూష , రైతులు పాల్గొన్నారు.



# ఖమ్మం నగరంలో తాగునీటి కష్టాలకు చెక్ డాం కూల్చివేతే కారణం

## బచ్చు విజయ్ కుమార్



**ఖమ్మం కార్పొరేషన్ జూలై 20 (జనంసాక్షి)**
ఖమ్మం నగరంలో ప్రస్తుతం నెలకొన్న తీవ్రమైన తాగునీటి కొరత కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ, అనాలోచిత, ముందుచూపు లేని పాలనకు ప్రత్యక్ష నిదర్శనమని మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఖమ్మం నగర ప్రజలకు శాశ్వత నీటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేరు వాగుపై సుమారు రూ.8 కోట్ల వ్యయంతో చెక్ డ్యామ్ నిర్మించారని ఆ చెక్ డ్యామ్ నిర్మాణం వల్ల మున్నేరు పరివాహక ప్రాంతంలో భూగర్భ జలమట్టం గణనీయంగా పెరగడంతో పాటు నగర వ్యాప్తంగా నీటి లభ్యత మెరుగుపడి ప్రజలకు తాగునీటి సమస్య చాలా వరకు పరిష్కారమైందని బచ్చు తెలిపారు.ప్రజల ప్రయోజనాలను పూర్తిగా విస్మరించి ఎలాంటి ప్రత్యామ్నాయ ప్రణాళిక లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పువ్వాడ పై రాజకీయ కక్షసాధింపుతో ప్రకాశ్ నగర్ వద్ద మున్నేరు చెక్ డ్యామ్‌ను పూర్తిస్థాయిలో కూల్చివేసిందని దాని ఫలితంగా ప్రస్తుతం ఖమ్మం నగర ప్రజలు నీటి నిల్వలు కోల్పోతున్నారని తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.ఒకవైపు గతంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చొరవతో వరద ముంపు నివారణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన మున్నేరు వాగుకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణ పనులు కొనసాగుతుండగా, మరోవైపు అదే ప్రాంతంలోని చెక్ డ్యామ్‌ను కూల్చివేయడం ద్వారా ప్రభుత్వం అసలు ఏ ప్రయోజనం సాధించిందని ప్రశ్నించారు. వరద నివారణ చర్యలు కొనసాగుతూనే నీటి నిల్వకు ఉపయోగపడే నిర్మాణాన్ని తొలగించడం పూర్తిగా ప్రణాళికా రాహిత్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజలకు మేలు చేసే చెక్ డ్యామ్‌ను తొలగించి నగరంపై నీటి కరువును కాంగ్రెస్ ప్రభుత్వం స్వయంగా ఆహ్వానించిందని విమర్శించారు. ప్రజలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులను సంరక్షించి మరింత బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం మాజీ మంత్రి పువ్వాడ హయాంలో నిర్మించిన ప్రజోపయోగ నిర్మాణాలను ధ్వంసం చేయడానికే పరిమితమైందని అభివృద్ధి చేయడం చేతకాక, గత ప్రభుత్వ పనులను కూల్చివేయడమే ఈ ప్రభుత్వ పాలనగా మారిందని విమర్శించారు.ఎల్‌నినో దృష్ట్యా తాగునీటి నిల్వలను పెంచడం, ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయడం, చెరువులు, వాగులు, చెక్ డ్యామ్‌లను సంరక్షించడం, భూగర్భ జలాలను పరిరక్షించడం వంటి ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దాని ఫలితంగా ఖమ్మం నగరం తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు ధోరణిని విడనాడి ఖమ్మం నగర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే సమగ్ర తాగునీటి కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని మున్నేరు వాగులో నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించే చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ప్రభుత్వాన్ని మాజీ సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్ డిమాండ్ చేశారు.



# వైద్య ఖర్చులకు ఇద్దరికీ రూ.20 వేల ఆర్థిక సాయం అందించిన మేవా..

**బూర్గంపహాడ్ జూలై 20 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామానికి చెందిన ముస్లిం ఎంపవర్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా) ఆధ్వర్యంలో ఇద్దరు నిరుపేదలకు వైద్య ఖర్చుల కోసం మొత్తం రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. సారపాకకు చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు యండి మహుముద్దీన్ ఖాన్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ భద్రాచలంలోని మోహన్‌రావు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు మేవా కమిటీ ఆయనకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించింది.అదేవిధంగా మండలంలోని కోయగూడెం పంచాయతీకి చెందిన షేక్ యాకుబ్ ప్రమాదవశాత్తు కిందపడటంతో చికిత్స పొందుతున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మరో రూ.10 వేల సాయాన్ని మేవా అందించింది.ఈ సందర్భంగా మేవా ప్రతినిధులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. భవిష్యత్తులో కూడా అవసరమైన వారికి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. సహకరించిన ప్రతి దాతకు కృతజ్ఞతలు తెలుపుతూ, మహుముద్దీన్ ఖాన్, షేక్ యాకుబ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేవా అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా, ప్రధాన కార్యదర్శి జహీర్ భాషా, సోహెల్ పాషా, సైదుద్దీన్, అక్బర్, అబ్దుల్ సలీం, అజీజ్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బేతెస్థ మినిస్ట్రీస్ 19వ వార్షికోత్సవం

**సూర్యాపేట (జనంసాక్షి):**
సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు ఖాసీంపేటలో బేతెస్థ మినిస్ట్రీస్ 19వ వార్షికోత్సవంను బిషప్ దుర్గం ప్రభాకర్ కరుణ శ్రీ హెప్సిబా ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగికులు పాస్టర్ డా.అబ్రాహాము జార్జి వెన్మాని కేరళ పాల్గొని దేవుని వాక్యాన్ని బోధించగా నల్లగొండ పాస్టర్ వై.యేసురత్నం తర్జుమా చేశారు.అనంతరం పాస్టర్ భక్తులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పాస్టర్స్ ను ఘనంగా సన్మానించారు.బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సిబా మాట్లాడుతూ ఎన్నో శ్రమల మధ్యలో ఎన్నో అద్భుతాలతో ఈ 19 సంవత్సరాలు కాపాడిన ఏసుక్రీస్తు ప్రభువుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా పాస్టర్స్ పెలోషిప్ అధ్యక్షులు బిషప్ గడ్డం డేవిడ్ రాజు, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షులు రెవ.డా జలగం జేమ్స్, రెవ.ఏర్పుల క్రీస్టోఫర్, పాస్టర్ ఎం.రూబెన్, టి.కిరణ్ బాబు, పాస్టర్ కొండేటి లాజర్, ఎం.క్రీస్టోఫర్, పాతకోటి దేవదానం, స్థల దాతలు పాస్టర్ సిరపంగి జార్జి, సిరపంగి ప్రకాశం, బోనగిరి స్టిఫెన్, కొమ్ము హోసన్నా తదితరులు పాల్గొన్నారు.






# పాత బావి పూడ్చి అంగన్వాడీ, పీహెచ్సీ ఏర్పాటు చేయాలి

## ○ వార్డు ప్రజలతో కలిసి బీఆర్ఎస్, బీజేపీ నాయకుల విజ్ఞప్తి

**బూర్గంపహాడ్ జూలై 20 (జనంసాక్షి)**
సారపాక 4వ వార్డులో వాడకంలో లేని పాత తాగునీటి బావిని పూడ్చివేసి, ఆ స్థలంలో అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) ఏర్పాటు చేయాలని వార్డు ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బీఆర్ఎస్, బీజేపీ నాయకులతో కలిసి ఐటీసీ యాజమాన్యం, స్థానిక ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందజేశారు. సుమారు 45 ఏళ్ల క్రితం ఐటీసీ పీఎస్పీడీ నిర్మించిన ఈ బావి ప్రస్తుతం వినియోగంలో లేకపోవడంతో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. దీంతో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బావిని పూడ్చి ఆ స్థలంలో అంగన్వాడీ కేంద్రంతో పాటు పీహెచ్సీ ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కొనకంచి శ్రీను, బానోతు శ్రీను, బీజేపీ నాయకుడు చుక్కపల్లి బాలాజీతో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

**సూర్యాపేట(జనంసాక్షి):**



ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యం శిబిరం అభినందనీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏఆర్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు పాషా సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు.కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ.షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెలుగు వెంకన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి,కొనతం రాజేష్ రెడ్డి, కోడి శిరీష శివ, డీసీసీ కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బొడ్డు సాయి, సంకరమద్ది శ్రావ్య సుధీర్ రెడ్డి,మద్దెబోయిన శ్రీనివాస్, నేరెళ్ల మధు,బండారు వెంకన్న, నరేందర్ నాయుడు, రావుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో విద్యార్థులతో మహాత్మా గాంధీ శాంతి సేన మానవహారం

**మధిర, జూలై 20 (జనంసాక్షి):**
ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద లడక్ సామాజిక కార్యకర్త, విద్యావేత్త సోనమ్ వాంగ్చుంగ్ చేపట్టిన నిరాహార దీక్షను బలవంతంగా విరమింపజేయడాన్ని ఖండిస్తూ, పార్లమెంట్ సమావేశాల్లో కాక్రోచ్ జనతా పార్టీ ప్రస్తావించిన అంశాలపై సమగ్ర చర్చలు జరగాలని కోరుతూ మధిర పట్టణంలో మహాత్మా గాంధీ శాంతి సేన ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. మధిర పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజి సమీపంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి గాంధీ శాంతి సేన ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు, నీట్ పరీక్షలపై వ్యక్తమవుతున్న ఆందోళనలు, విద్యా వ్యవస్థలో పారదర్శకత వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు.సోనమ్ వాంగ్చుంగ్ చేపట్టిన నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువతలో చర్చనీయాంశంగా మారిందని, ప్రజాస్వామ్య పద్ధతిలో చేపట్టిన నిరసనలకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై రాజకీయాలకు అతీతంగా చర్చించి, తగిన నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు విద్యా రంగంలో నమ్మకం, పారదర్శకత పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకొని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ శాంతి సేన సభ్యులు మొగిలి శ్రీను,బొక్క పుష్పరావు,రావూరి వాసు ,కోనేటి సతీష్ ,అనిల్ కుమార్ పవన్,పండు,మరియు స్థానిక విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.



# కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి

## నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్టిఏను రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్

**ఖమ్మం, (జనంసాక్షి) :**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగర కేంద్రంలోని ఉమెన్స్ కళాశాల వద్ద నుంచి గాంధీ చౌక్ వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్టిఏను రద్దు చేయాలని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ ఈరోజు ఎస్ఎఫ్ఐ అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా ఈ నిరసన ప్రదర్శనను నిర్వహించామని దేశవ్యాప్తంగా 22 లక్షలకు పైగా విద్యార్థులు నీట్ పరీక్షలు రాస్తే ప్రశ్నాపత్రం లీక్ కావడం చాలా దుర్మార్గమని దానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా రాజీనామా చేయాలని పరీక్షలు నిర్వహించడం చేతకాని ఎన్టిఏను రద్దు చేయాలని అదే విధంగా 19 రోజులకు పైగా నిరాహార దీక్ష చేసిన సోనమ్ వాంగ్ చుక్ దీక్షను భంగం కలిగించి తీసుకెళ్లడం ప్రజా స్వామ్యానికి విరుద్ధమని ఆయన అన్నారు.




ఆయన దీక్షకు భంగం కలిగిస్తే అదే దీక్ష ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు ఆదర్శ్ సజీ, ఎస్ఎఫ్ఐ అఖిల భారత సహాయ కార్యదర్శి ఐ సి గోష్ తదితరులు దీక్షను చేస్తున్నారని. విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ పార్లమెంటు ముట్టడికి యత్నించిన విద్యార్థులను వారి మద్దతుదారులను పోలీసులు లాఠీచార్జ్ చేసి బెదిరించడం వారిపైన కాల్పులు జరపడం చాలా దుర్మార్గమని బిజెపి ప్రభుత్వం ప్రధాని ఇప్పటికైనా స్పందించి ఎన్టిఏను రద్దుచేసి విద్యా శాఖ మంత్రిని బర్తరపు చేయాలని అన్నారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందో ళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వంకాయల రాజు రాష్ట్ర కమిటీ సభ్యురాలు సాత్విక ఖమ్మం డివిజన్ అధ్యక్షులు త్రినాథ్ జిల్లా కమిటీ సభ్యులు సింధు నాయకులు లోహిత్ కుమార్, శ్యామ్, హారిక, నిఖిల,,పద్మశ్రీ, అక్షయ, వీక్షణ, శ్రీవిద్య, తరుణి తదితరులు పాల్గొన్నారు.




# పే అండ్ యూస్ పబ్లిక్ టాయిలెట్లు ప్రారంభం

**ఖమ్మం కార్పొరేషన్, జూలై 20(జనంసాక్షి)**

ఖమ్మం జిల్లా కలెక్టర్ మరియు ఖమ్మం మునిసిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు, స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఈరోజు ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక సౌక ర్యాలతో నిర్మించిన ఆస్పిరేషనల్ "పే అండ్ యూజ్" పబ్లిక్ టాయిలెట్స్ ప్రారంభించ బడినవి. ఈ టాయిలెట్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతిరోజూ వచ్చే సుమారు 1,500 నుంచి 2,000 మంది ప్రజల అవసరాలకు అనుగుణంగా రూపకల్పన చేయడం జరిగింది. ఇందులో మహిళలు, పురుషులు, చిన్నారులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఇన్సినిరేటర్, వెండింగ్ మెషిన్, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు, హ్యాండ్‌రైల్స్, వీల్‌చైర్ ర్యాంప్, శిశువులకు డైపర్ మార్చే (బేబీ చేంజింగ్) సౌకర్యం తదితర ఆధునిక వసతులు ఏర్పాటు చేయబడ్డాయి. ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షితమైన, ఆరోగ్యకరమైన పారిశుద్ధ్య సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ఈ పబ్లిక్ టాయిలెట్‌ను జన సువిధా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ నిర్మించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ , అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనిల్ , ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఎం. నరేందర్ , ఆర్ఎంఓ డా. రాంబాబు , ఆర్ఎంఎస్ సుధాకర్ , ఖమ్మం నగరపాలక సంస్థ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ , శానిటరీ ఇన్స్పెక్టర్లు మల్లయ్య , అహ్మద్ , అలాగే జన సువిధా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధులు సుభాష్ , రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ మహిళా సంఘం అధ్యక్షురాలిగా మిట్టపల్లి శ్రీదేవి ప్రమాణ స్వీకారం

**సూర్యాపేట (జనంసాక్షి):**

సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలుగా మహిళల సాధికారత కోసం తనవంతు కృషి చేస్తానని, ఆర్యవైశ్య మహిళలకు మన సంస్కృతి సాంప్రదాయాలు, పురాణ ఇతిహాసాలు పట్ల అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తానని పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి అన్నారు. సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలిగా మిట్టపల్లి శ్రీదేవి ప్రమాణ స్వీకారం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాయపూడి భవాని ఆదివారం ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవ అధ్యక్షురాలుగా బ్రహ్మాండ్లపల్లి తరంగిణి, వర్కింగ్ ప్రెసిడెంట్ గా బెలిదే రాధ, సెక్రటరీగా లకుమారపు పద్మజ, ట్రెజరర్ గా ఓరుగంటి లావణ్య , ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యురాలు ప్రమాణ స్వీకారం



చేశారు. ఈ సందర్భంగా మిట్టపల్లి శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు తన పిల్లల్ని తన కుటుంబాన్ని చూసుకోవడమే కాకుండా వారికి బంగారు భవిష్యత్తు నిర్మాణం చేస్తారని అన్నారు. అటువంటివారు సామాజిక కార్యక్రమాలలో కూడా చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య మహిళలలో పేదవారికి కుట్టు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, సంఘం నిర్వహించే కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. ఈ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, ఊరే లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వర రావు, పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు, కర్నాటి కిషన్, చల్లా లక్ష్మీకాంత్, ఇమ్మడి సోమనరసయ్య, బండారు రాజా, మిట్టపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# టీజీఎస్ ఆర్టీసీ బస్సుల్లో క్యాష్‌లెస్ టికెట్ల సౌకర్యం

## రీజినల్ మేనేజర్ జోష్న

**నల్లగొండ, జులై 20, (జనం సాక్షి):**

టీజీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు నగదు రహిత (క్యాష్‌లెస్) టికెట్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నల్లగొండ రీజినల్ మేనేజర్ శ్రీమతి టీ. జోష్న తెలిపారు. పల్లె వెలుగు బస్సుల నుంచి ప్రారంభించి టీజీఎస్ ఆర్టీసీకి చెందిన అన్ని రకాల బస్సుల్లో యూపీఐ ద్వారా టికెట్లు కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పించినట్లు ఆమె వెల్లడించారు. బస్సుల్లో విధులు నిర్వహిస్తున్న కండక్టర్లు, డ్రైవర్ల వద్ద ఉన్న టికెట్ యంత్రాల్లో (టిమ్ మెషిన్) ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి, యూపీఐ ద్వారా చెల్లింపు చేసి వెంటనే టికెట్ పొందవచ్చని తెలిపారు. ఈ సదుపాయం ద్వారా చిల్లర డబ్బుల సమస్యలు, నగదు చెల్లింపులో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని, ప్రయాణికులు మరింత సులభంగా, సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. టీజీఎస్ ఆర్టీసీ అందిస్తున్న ఈ ఆధునిక సేవలను ప్రయాణికులంతా విస్తృతంగా వినియోగించుకుని, సంస్థ అభివృద్ధి, మనుగడకు తమ వంతు సహకారం అందించాలని నల్లగొండ రీజినల్ మేనేజర్ శ్రీమతి టీ. జోష్న కోరారు.

## గోపురాలపై మొలిచిన మొక్కలు..

# దేవాలయ నిర్వహణలో ఘోర నిర్లక్ష్యం!

- **ప్రసిద్ధ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అధ్వాన్న పరిస్థితులు**
- **గోపురాలు, కల్యాణ మండపం, ధ్వజస్తంభం దుస్థితి - భక్తుల ఆగ్రహం**

**అన్నపురెడ్డిపల్లి, జూలై 20 (జనంసాక్షి)**

మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వెలుగుచూస్తోంది. ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుగాంచిన ఈ ఆలయంలో గోపురాలు, ప్రాకారాలు, కల్యాణ మండపం పై అడవి మొక్కలు మొలిచి కనిపించడం భక్తులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. ఆలయ పవిత్రతను కాపాడాల్సిన అధి కారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారని స్థానికులు మండిపడుతున్నారు.

**మహా కుంభాభిషేకం తర్వాతే ఈ పరిస్థితా..?**

ప్రతిష్ఠాత్మకంగా మహా కుంభాభిషేకం నిర్వహించి కొన్ని నెలలు కూడా గడవకముందే ఆలయ గోపురాలపై అడవి మొక్కలు పెరగడం నిర్వహణ వైఫల్యానికి నిదర్శనమని భక్తులు విమర్శిస్తున్నారు. ఆలయ అభివృద్ధి పనులు నాణ్యత లేకుండా, మొక్కుబడిగా చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ధ్వజస్తంభం, సోలార్ వ్యవస్థ అస్తవ్యస్తం**

భక్తులు అత్యంత పవిత్రంగా భావించే ధ్వజస్తంభానికి అమర్చిన తొడుగు చిరిగిపోయి అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆలయ గోడలపై ఏర్పాటు చేసిన సోలార్ భద్రతా వ్యవస్థ కూడా పనిచేయకపోవడంతో ఆలయ రక్షణపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ ఈవో స్పందన కూడా ఆశించిన స్థాయిలో లేదని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**కోతుల బెడదతో భక్తులకు ఇక్కట్లు**

ఆలయ ప్రాంగణంలో కోతుల సంచారం అధికంగా ఉండడంతో దర్శనానికి వచ్చే భక్తులు భయాందోళనలకు గురవుతున్నారు. కోతులు వెంటపడుతున్నా నివారణ చర్యలు



చేపట్టకపోవడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కల్యాణ మండపం పరిసరాల్లో మొక్కలు, చెత్త పేరుకుపోవడంతో పరిశుభ్రత పూర్తిగా దెబ్బతింది.

**ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలంటున్న భక్తులు**

పవిత్రమైన దేవాలయంలో కనీస నిర్వహణ, పరిశుభ్రత కూడా లేకపోవడం బాధాకరమని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోపురాలపై మొలిచిన మొక్కలను వెంటనే తొలగించి, ఆలయ ప్రాంగణాన్ని శుభ్రపరచడంతో పాటు ధ్వజస్తంభం, సోలార్ వ్యవస్థ మరమ్మతులు చేపట్టి, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# ఘనంగా రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

**భద్రాచలం జూలై 20 (జనంసాక్షి)**

రోటరీ క్లబ్ 39వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా షేక్ అజీమ్, కార్యదర్శిగా శ్రీనాథ్ రాజేష్, కోశాధికారిగా రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శివనారాయణ ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఐటీసీ యూనిట్ హెడ్ శైలేందర్ సింగ్ ముఖ్య అతిథిగా, పాకాల దుర్గాప్రసాద్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. అసిస్టెంట్ గవర్నర్ వెంకటరెడ్డి నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు షేక్ అజీమ్ మాట్లాడుతూ జిల్లా గవర్నర్ సహకారంతో ఈ ఏడాది శాశ్వత ప్రయోజనం కలిగించే సేవా కార్యక్రమాలు, పర్మినెంట్ ప్రాజెక్టులను చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు వరలక్ష్మి, మాజీ కార్యదర్శి బాలకృష్ణ మహేంద్ర, హరి ప్రసన్న కుమార్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ పలివెల రవికుమార్, ప్రోగ్రామ్ చైర్మన్, పాస్ట్ ప్రెసిడెంట్ ప్రభాకర్ గుప్తా, యశోద రాంబాబు, వీరయ్య, అజయ్ కుమార్, నాగేశ్వరరావు, మునికేశవరావు, శ్రీ మహాలక్ష్మి, వసంతరావు, మధు, చైతన్య, డా. సోమయ్య, సభ్యులు చలపతి, సాగర్, శ్రీనివాసరావు, మోహనకృష్ణ, గ్లాడ్ స్టోన్, నరసింహారావు, శ్రీధర్ రెడ్డి, వంద వాసు తదితరులు పాల్గొన్నారు.





## దాతల సహకారంతో గుడిని మరింత అభివృద్ధి చేద్దాం
### సర్పంచ్ గర్దాస్ విక్రమ్

**రామన్నపేట, జూలై 20 (జనంసాక్షి):**
దాతల సహకారంతో ఆలయాన్ని సుందరంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దవచ్చు అని సర్పంచ్ గర్దాస్ విక్రమ్ అన్నారు. మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ తల్లి దేవాలయానికి దర్శనం కోసం వివిధ ప్రదేశాలనుండి వచ్చే భక్తులకు మంచి వసతి సదుపాయాలు కల్పించే ఏర్పాట్లలో భాగంగా సర్పంచ్ కోరిక మేరకు ధాతలు అందిస్తున్న సహకారంతో భక్తులకు వసతి సౌకర్యాలకు నిర్మాణాలు చేస్తున్నారు. ధాత భువనగిరి కవిత శ్రీనివాస్ తండ్రి బుగ్గయ్య ముత్యాలమ్మ తల్లి దేవాలయం వద్ద స్నానపు గదుల నిర్మాణం కోసం ముందుకు రావడం జరిగింది. సోమవారం నిర్మాణ పనులనుసర్పంచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, పంచాయతీ కార్యదర్శి నరేందర్, సింగణ బోయిన గణేష్,రాస వెంకటేష్, రాజన్నగారి రమేష్, పాలసంఘము చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలం,చేనేత సహకారసంఘము చైర్మన్ రవ్వ నర్సింహా, ఈర్లపల్లి మల్లయ్య, గోళ్లేపల్లి యాదయ్య,వడ్లకొండ బిక్షపతి,సింగణబోయిన మల్లేశం, కూకుట్ల సత్తయ్య, కాటేపల్లి రమేష్,బొల్ల మత్యగిరి,నీరుడు వెంకటేష్, నీరుడు నరేష్, గర్ధాస్ సాయి, గర్ధాస్ శ్రీకాంత్,అమినొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# మేకల రాములు జీవితం ఉద్యమాలకే అంకితం
### - సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి

**సంస్థాన్ నారాయణపురం. జూలై 20 (జనం సాక్షి):**
సంస్థాన్ నారాయణపురం ప్రజా ఉద్యమాలకు జీవితాంతం అంకిత భావంతో సేవలు అందించిన కామ్రేడ్ మేకల రాములు త్యాగాలు ఎన్నటికీ మరువలేనివని సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి పేర్కొన్నారు. పేద ప్రజలు రైతుల కోసం గీత కార్మికుల హక్కుల కోసం చివరి శ్వాస వరకు పోరాడిన యోధుడిగా మేకల రాములు నిలిచిపోయారని కొనియాడారు. సంస్థాన్ నారాయణపురం మండలం చిల్లాపురం గ్రామంలో సిపిఐ సీనియర్ నాయకుడు మేకల రాములు( 62 ) సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో కన్నుమూశారు. రాములు సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవిత లక్ష్యంగా భావించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర ఉద్యమాలు నిర్వహించిన వ్యక్తి మేకల రాములు అని తెలిపారు.ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మేకల రాములు భౌతికంగా దూరమైన ఆయన ఆశయాలు ఉద్యమ స్ఫూర్తి ప్రజల గుండెల్లో చిరస్థాయి అని పిలుస్తాయని అన్నారు. కలలు కన్నా సమ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయడమే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ప్రజల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు వృధా కావని దోపిడిపై పోరాటం మరింత ఉధృతం కావాలని నాయకులు స్పష్టం చేశారు. మేకల రాములు బెదిరింపులకు తలవంచని ధైర్యం, అధికారకాండ కు ఎదురొడ్డి నిలిచిన పోరాట ప్రతిమ కలిగిన గొప్ప కమ్యూనిస్టు అని అన్నారు. అంతిమయాత్రలో సైతం పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కె.శ్రీనివాస్,పల్లె శేఖర్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బి జగన్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య,కలకొండ సంజీవ సిపిఐ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ దేసిడి నరేందర్, రుద్ర రాములు, కొప్పు యాదయ్య, మోగుదాల శంకరయ్య, రుద్ర భాస్కర్, మండల కార్యవర్గ సభ్యులు పల్లె మల్లారెడ్డి, సురవి నరసింహ, మారగోని నాగరాజు, ప్రశాంత్, గ్రామ శాఖల కార్యదర్శులు, కొప్పు సుధాకర్, దుబ్బాక కిషన్,



బైకని రాజు, సర్పంచ్ లు ముత్యాల అంజయ్య, కురుమిద్ద వినోద, భీమనపల్లి గాలయ్య ప్రజా సంఘాల నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారులు అమరవీరుల గీతాలు ఆలపించారు . కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కరెం టోత్ బిక్షపతి నాయక్, మండల అధ్యక్షుడు కే శ్రీను నాయక్ , కుక్కల నరసింహ రాములు పార్థివ దేహం పై పూలమాలలు వేసి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేశారు. రాములు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వర్షపు నీటిని ఒడిసిపట్టాలి
### -ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ కోలా ఉదయభానుఉపేందర్




**హుజూర్ నగర్, జూలై 20 (జనంసాక్షి):**
వర్షపు నీటిని ఒడిసి పట్టాలని గోవిందపురం ఎనిమిదో వార్డు కౌన్సిలర్ కోలా ఉదయభానుఉపేందర్ అన్నారు. హుజూర్ నగర్ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సోమవారం గోవిందపురంలోని ఎనిమిదో వార్డులో ఇంకుడు గుంతల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంటలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూగర్భ జలాల పరిరక్షణ కు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వర్షపు నీటిని ఒడిసిపడితేనే భూగర్భ జలాలు మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అశోక్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ అత్తి రాజశేఖర్ గౌడ్, వార్డు ఇన్చార్జి అనంతు హర్షవర్ధన్, గొట్టేముక్కల రాములు, దాసరి పున్నయ్య, నాగులు మీరా , బాబు, ఏదునూరు సైదులు, ఆదెమ్మ, కామేశ్వరి, భాగ్యలక్ష్మి, భార్గవి, చిలకపత్తిని శాంతమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.



## సూర్యాపేటలో వైభవంగా జగన్నాథ రథయాత్ర

**సూర్యాపేట (జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలో సోమవారం జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గీతా మందిరం, ఇస్కాన్ అబిడ్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జగన్నాథ స్వామివారిని దర్శించుకుని రథయాత్రలో పాల్గొన్నారు. గీతా మందిరం వద్ద ప్రారంభమైన రథయాత్ర పాత బస్టాండ్, పీఎస్ఆర్ సెంటర్,60 ఫీట్ రోడ్, కొత్త బస్టాండ్, శంకర్ విలాస్ సెంటర్ మీదుగా గీతా మందిరం వద్దకు చేరుకుంది. అంతకుముందు రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది,60 ఫీట్ రోడ్డులో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని జగన్నాథ రథయాత్రలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్నాథుని కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఇస్కాన్ ప్రతినిధులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## భూ వివాదాలకు శాశ్వత పరిష్కారంగా భూ రీసర్వే
### కొండమల్లేపల్లి తహసిల్దార్ నరేందర్

**కొండమల్లేపల్లి, జూలై 20 (జనంసాక్షి):**
భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు పారదర్శకంగా భూ రికార్డులను డిజిటలైజేషన్ చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల రీ సర్వేకు శ్రీకారం చుట్టిందని తహసీల్దార్ నరేందర్ అన్నారు. ఇందులో భాగంగా సోమవారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని వర్ధమానిగూడెం గ్రామంలో భూ సర్వేపై ప్రజాప్రతినిధులు రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. క్షేత్రస్థాయిలో త్వరలోనే భూ రీసర్వే ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో తరతరాలుగా వస్తున్న భూ వివాదాలు, సరిహద్దు తగాదాలకు ఈ సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అస్తవ్యస్తంగా ఉన్న రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన భూ వివాదాలు పొలం గట్ల సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా భూముల సమగ్ర రీసర్వే ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు ప్రతి సర్వే నంబరుకు భూధార్ ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వారివెంట మండల రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్, మండల సర్వేయర్స్, జిపిఓలు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి

- భారత జాతీయ మహిళా సమాఖ్య డిమాండ్
- మోటకొండూరు మండల 3వ మహాసభలో నూతన కమిటీ ఎన్నిక

**మోటకొండూరు, జులై 20(జనం సాక్షి):**
రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో పేద ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య డిమాండ్ చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని చాడ గ్రామంలో భారత జాతీయ మహిళా సమాఖ్య 3వ మండల మహాసభ సోమవారం ఘనంగా జరిగింది. ఈ సభకు చొప్పరి భాగ్యమ్మ, ఆలేటి సబిత, రేపాక ఉమా అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలకు స్వేచ్ఛ కరువైందన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం పేద మహిళలకు ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, నెలకు రూ. 2500 ఆర్థిక సాయం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను వెంటనే అందించాలన్నారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, గృహహింసను అరికట్టేందుకు పోక్సో తదితర చట్టాలను కఠినంగా అమలు చేసి రక్షణ కల్పించాలని కోరారు. ప్రభుత్వాలు స్పందించకుంటే మహిళలను ఐక్యపరిచి పెద్ద ఎత్తున ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామని ఆమె హెచ్చరించారు.



**నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**
అనంతరం 21 మంది సభ్యులతో మోటకొండూరు మండల నూతన కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. గౌరవాధ్యక్షురాలు చొప్పరి భాగ్యమ్మ, అధ్యక్షురాలు దామర లక్ష్మి,ఉపాధ్యక్షులు రేపాక ఉమా, మంచాల పద్మ,ప్రధాన కార్యదర్శి మంచాల రాధమ్మ, సహాయ కార్యదర్శులు,ఆలేటి సబిత, మంత్రి రేణుక, కోశాధికారి దొంతి వెంకటమ్మ లు ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, మండల పార్టీ కార్యదర్శి గాదేగాని మాణిక్యం, జిల్లా మహిళా సమాఖ్య గౌరవాధ్యక్షురాలు గుర్రం రాజమణి, జిల్లా నాయకురాలు వడ్లకొండ భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు మారినా చెరువుపల్లి రోడ్డు తలరాత మారలేదు..!

ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ,లో వోల్టేజ్ ఉన్నచోట ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, ఇప్పటి వరకు వేసిన పంటలు కాపాడాల్సిన అవసరం ఉందని, ఇందుకు ప్రతిరోజు సమీక్షించాలని మంత్రి ఆదేశించారు.

ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ బస్వాపూర్, మల్లన్నసాగర్ ల్యాండ్ ఆక్విజేషన్ కు సంబంధించిన 87 కోట్ల రూపాయలు విడుదల చేస్తే గంధమళ్ళ పూర్తవుతుందని, శామీర్పేట వద్ద 5 కిలోమీటర్ల పని పనులు పూర్తికానందున భువనగిరి ,ఆలేరుకు నీళ్లు వచ్చే అవకాశాలు లేకుండా పోయాయని, ప్రభుత్వం ఇదివరకు నిధులు మంజూరు చేసినందున సంబంధిత ఏజెన్సీపై ఒత్తిడి తీసుకొచ్చి వెంటనే పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. నియోజకవర్గంలో 7 సబ్ స్టేషన్లు మంజూరయ్యాయని, పనులు మొదలు పెట్టారని, ఇప్పటివరకు ఇంకా పూర్తి కాలేదని, సంబంధిత అధికారులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కోరారు.తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు మాట్లాడుతూ బునియదిగాని కాలువ భూసేకరణకు బడ్జెట్ మంజూరు చేయాలని ,దేవాదుల ఫేస్ -6 ద్వారా తుంగతుర్తి నియోజకవర్గానికి నీళ్లు అందించాలని, తన నియోజకవర్గంలో తాగునీటికి సంబంధించి బోర్ల తవ్వకానికి ప్రాధాన్యత ఇవ్వాలని , ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో విపత్కర పరిస్థితుల దృష్ట్యా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఆరుతడి పంటలైన కందులు, పెసర్లు వంటివి వేసేందుకు రైతులు సుముఖంగా ఉన్నప్పటికీ కోతుల బెడద వల్ల పండించలేకపోతున్నారని, ఈ కోతుల బెడదను తప్పించేందుకు అధికారులు చూడాలని, అలాగే నియోజకవర్గంలోని లిఫ్టుల మరమ్మతులను పూర్తిచేయాలని, చెరువు కట్టలను బలోపేతం చేయడం, జంగిల్ క్లియరెన్స్ చేయాలని కోరారు.కోదాడ శాసనసభ్యురాలు పద్మావతి రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో వల్ల ఏర్పడిన కరువు పరిస్థితులను అధిగమించడంలో భాగంగా భూగర్భ జలాలను పెంపొందించుకునేందుకు సోక్ పిట్ల నిర్మాణం, ఊట కుంటల నిర్మాణం చేపట్టాలని, అలాగే రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా అవగాహన కల్పిస్తామని, అయితే కోతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ మాట్లాడుతూ డిండి ప్రాజెక్టు నుండి తాగునీటికి ఎలాంటి అవకాశం లేనందున దీనికి లింకేజీ ఏర్పాటు చేయాలని, నియోజకవర్గంలో పవర్ ట్రాన్స్ఫార్మర్లు లేనందున 132 కెవి సబ్




స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.సూర్యాపేట శాసనసభ్యులు జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట పట్టణానికి తాగునీటి సమస్య లేకుండా ప్రతిరోజు నిర్దేశించిన పరిమాణంలో తాగునీటిని అందించాలని, సమస్య తీవ్రం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను కోరారు.ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి వేసే అవకాశం లేనందున పత్తి వేసేందుకు అవకాశం ఉందని, అయితే పత్తి రైతులను పెద్ద ఎత్తున ఆదుకోవాలని, మిషన్ భగీరథ నీరు మునుగోడు నియోజకవర్గంలో సరిగా రావడం లేదని, ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ మిషన్ భగీరథ నీటిని అందించాలని ,విద్యుత్ కు సంబంధించి రైతులు చాలా చోట్ల డీడీలు కట్టారని, వారికి కనెక్షన్లు ఇప్పించాలని కోరారు.సమావేశం ప్రారంభమైన వెంటనే నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఎల్ నినో ప్రభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంసిద్ధత, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు , ఉమ్మడి జిల్లా తరఫున పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశానికి సమర్పించారు.ప్రభుత్వ విప్ , నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, స్పెషలాఫీసర్, రాష్ట్ర కార్మిక మరియు ఉపాధి కల్పన సెక్రటరీ దాసరి హరిచందన, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్, యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, మున్సిపల్ చైర్మన్లు, నల్గొండ రెవెన్యూ, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, ప్రేమ్ కరణ్ రెడ్డి ,ఆయా జిల్లాల అధికారులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో వ్యవసాయం, నీటిపారుదల, ఉద్యాన, విద్యుత్తు, మిషన్ భగీరథ ,భూగర్భ జల ,గ్రామీణ అభివృద్ధి, పశు సంవర్ధక శాఖలపై సమీక్షించారు.ఈ సందర్భంగా తెలంగాణ జలసిరిపై రూపొందించిన గోడపత్రికను మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు ఆవిష్కరించారు.

## రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో సూర్యాపేటకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి



**సూర్యాపేట (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా సూర్యాపేటకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ సంఘ అసోసియేటెడ్ కార్యవర్గ సభ్యులు గోపారపు రాజు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు.రాష్ట్ర మహాసభలో సూర్యాపేట జిల్లాకు మరింత ప్రాతినిధ్య కల్పించాలని కోరారు.రాష్ట్ర మహాసభ ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇచ్చేటువంటి ఉపకార వేతనాలను, విద్య నిధిలో సూర్యాపేట పట్టణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.భవిష్యత్తులో సూర్యాపేట ఆర్యవైశ్యులు ఎవరైనా ఇంకా సభ్యత్వం తీసుకోకుండా ఉంటే వారిని గుర్తించి సభ్యత్వ నమోదు కార్యక్రమము చేపట్టి రాష్ట్రంలో సూర్యాపేట మొదటి స్థానంలో ఉండేలా, రాష్ట్ర మహాసభకు అన్ని రకాలుగా సహకరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరావు, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బండారు రాజా, నాయకులు రాచర్ల కమలాకర్ , గుండా వెంకన్న, గుడిపాటి రమేష్, బొల్లం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాలకు గ్రంథపాలకుడి పోస్ట్ మంజూరు చేయాలి

### పిల్లలమర్రి పినవీరభద్రం కళాపీఠం అధ్యక్షులు, శీల అవిలేను

**తుంగతుర్తి జులై 20 (జనం సాక్షి)**



జిల్లా పరిషత్ పాఠశాలలో గ్రంథాలయ నిర్వహణ సమర్ధవంతంగా నిర్వహించేందుకు ప్రతి పాఠశాలకు గ్రంథపాలకుడి పోస్ట్ మంజూరు చేయాలని పిల్లలమర్రి పినవీర భద్ర కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, తెలుగు ఉపాధ్యాయులు శీల అవిలేను ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేటి తరం పిల్లలు చదవడం రాయడంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, పఠన సామర్థ్యాలు సాధించడానికి గ్రంథాలయమే పరిష్కారమని అన్నారు. ముఖ్యంగా పిల్లలు సెల్ ఫోన్ కు బానిసలు కాకుండా, పుస్తకానికి చేరువ కావడానికి ప్రతి పాఠశాలలో ప్రత్యేక గ్రంథాలయం ఉండాలన్నారు. ఇందుకోసం గ్రంథాలయానికి ప్రత్యేక గది, గ్రంథాలయ నిర్వహణకు గ్రంథపాలకుడి అవసరం ఎంతో ఉందన్నారు. ప్రస్తుతం గురుకుల పాఠశాలల్లో గ్రంథ పాలకుడి పోస్టు ఉన్నదని, ఇది అన్ని పాఠశాలలకు విస్తరింప చేయాలని కోరారు. పిల్లల్లో ఆలోచనలు రేకెత్తించడానికి, విశ్లేషణ సామర్థ్యాన్ని పెంచడానికి, సృజనాత్మకతను వెలికితీయడానికి, అత్యంత కీలకమైన గ్రంథాలయాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తే విద్యార్థుల అభ్యసన సమస్యలకు చక్కని పరిష్కారం చూపించిన వాళ్లమవుతామన్నారు . ఈ దిశగా ప్రభుత్వాలు పాలకులు, కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## మంత్రి ఉత్తమ్ పద్మావతి దంపతులపై ఆరోపణలను ఖండించిన కాంగ్రెస్ నాయకులు

**హుజూర్‌నగర్, జూలై 10 (జనం సాక్షి):**



కోదాడ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, హుజూర్ నగర్ కాంగ్రెస్ పార్టీ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పద్మావతి దంపతులపై చేసిన ఆరోపణలను హుజూర్ నగర్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. సోమవారం హుజూర్‌నగర్ ఇందిరా భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గెల్లి రవి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ, "పాము దాని పిల్లలను తిన్నట్టుగా కోదాడలో ఉన్న బీసీ బిడ్డలను జైళ్లకు పంపి, దాడులకు పాల్పడి ఇప్పుడు బీసీ బిడ్డనంటూ ప్రజలను మభ్యపెడుతున్నావు" అని మల్లయ్య యాదవ్ పై మండిపడ్డారు."గతంలో కోదాడ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రతి పనిలో కమిషన్ తీసుకున్నావని విమర్శించారు. "నీ గురించి మీ అధిష్టానానికే నమ్మకం లేదు. నీకు ఎమ్మెల్యే టికెట్ కాదు కదా, కనీసం జడ్పిటిసి టికెట్ కూడా రాదు" అని జోస్యం చెప్పారు. తన ఉనికిని కాపాడుకోవడానికి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పద్మావతి రెడ్డి గురించి తప్పుడు కథనాలు సృష్టించడం హాస్యాస్పదమని అన్నారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ప్రజా నాయకులతో చర్చించే స్థాయి నీకు లేదని తీవ్రంగా ధ్వజమెత్తారు. రెండు నియోజకవర్గాల్లో బీసీలను రాజకీయంగా బలోపేతం చేసిన ఘనత ఉత్తమ్ పద్మావతి దంపతులదేనని, ముందు నీ స్థాయి తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.ఈ సమావేశంలో రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, పట్టణ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## వెల్లంకిలో బెల్ట్ షాపుల మూసివేతకు సంతకాల సేకరణ

రామన్నపేట, జూలై 20 (జనంసాక్షి): మండలంలోని వెల్లంకి గ్రామంలో మద్యం అక్రమ విక్రయాలు, బెల్ట్ షాపుల వల్ల యువత పాడవుతుందని, కుటుంబాల్లో గొడవలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ బీజేపీ గ్రామశాఖ అధ్యక్షులు నకిరేకంటి మహేష్ ఆధ్వర్యంలో గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.గ్రామ ప్రజల నుంచి సేకరించిన సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని గ్రామ సర్పంచ్ ఇడెం రాధా శ్రీనివాస్ కు, ఉపసర్పంచ్ మిర్యాల రాజ్ కుమార్ కు అందజేశారు.వెల్లంకి గ్రామ పరిధిలోని అన్ని బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలని, మద్యం నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య, మండల ప్రధాన కార్యదర్శులు జంగిలి సత్యనారాయణ, బెజ్జంకి శివకుమార్ వార్డు మెంబర్ మొగిలి భాగ్యలక్ష్మి రమేష్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్ రావు, డా. వి కృష్ణ,బాబురావు, భాస్కర్,ఉమాపతి, బాలరాజు, నారాయణ,శ్రీకాంత్,లింగస్వామి మరియు గ్రామ ప్రజలు, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఫిట్‌నెస్ లేని ప్రైవేటు పాఠశాల బస్సులను సీజ్ చేయాలి

### ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు

**తిరుమలగిరి (సాగర్), జూలై 20 (జనంసాక్షి):**



తిరుమలగిరి (సాగర్) మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ కు ఎంఎస్ఎఫ్ (మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని ప్రైవేటు పాఠశాలల బస్సులను వెంటనే తనిఖీ చేసి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రతి పాఠశాల బస్సులో తప్పనిసరిగా హెల్పర్‌ను నియమించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ కొన్ని ప్రైవేటు పాఠశాలలు యూనిఫారాలు, పుస్తకాల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పాఠశాలలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు ఆదిమళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.